# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

హైదరాబాద్ ఆదివారం 23-11-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:86 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం- నేటికి అందం**

"సంజీవని"పథకమ్మును
కుంజర వరదుని గొలుచుచు కుప్పము లోనన్
మంజులముగ నిరుపేదల
రంజింపగ చంద్రబాబు ప్రారంభించెన్ !!

(సంజీవని పథకం కుప్పంలో చంద్రబాబు ప్రారంభించారు)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

అటు బిడ్డ పార్టీమీద
అవినీతి బాణాలు
ఇటు కొడుకు కేసుల్లో
ఇరుక్కున్న ప్రాణాలు.
కూలబడ్డ కారునింకా
కదిలిస్తడా అధినేత
స్థానికంలో వినిపిస్తడా
శక్తితోని దాని మోత



-వేల్పుల నారాయణ
9440433475

# ఇది మంచి పరిణామం: డిప్యూటీ సీఎం భట్టి



ఖమ్మం, నవంబర్ 22: వైరాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయటం మంచి పరిణామమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శనివారం నాడు వైరా నియోజకవర్గ కేంద్రంలో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ మోడల్ స్కూల్, వైరా నియోజకవర్గంలో రూ. 21 కోట్ల వ్యయంతో నిర్మించబోయే 7 సబ్ స్టేషన్ల నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు 200 శాతం చార్జీలు పెంచింది తమ ప్రభుత్వమే అని చెప్పుకొచ్చారు.

బడుగు బలహీన వర్గాలకు ఉన్నత విద్య ద్వారానే వారు ఉన్నత స్థానానికి చేరుతారన్నారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ పార్టీ డ్వాక్రా మహిళలను మోసం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలను ఇచ్చిందని తెలిపారు.

రాష్ట్రంలో రూ. 590 కోట్లు వెచ్చించి నిరుపేదలకు రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యాన్ని అందించిన ఘనత తమ ప్రభుత్వానిదే అని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ఉన్న మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించింది తామే అన్నారు.

తాను పుట్టిన ఈ నేలను తప్పనిసరిగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే వంద పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేశానని తెలిపారు. గతంలో వైరా రిజర్వాయర్ రైతుల కోసం నీటిని వదిలే విషయంలో జైలుకి కూడా వెళ్లినట్లు గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం రైతులకు అంకితమని.. దోపిడీదారులకు, దొంగలకు కాదన్నారు. ప్రపంచంతో పోటీపడే విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిచే విధంగా తీసుకెళ్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయిన 37 మంది మావోయిస్టులు



హైదరాబాద్, నవంబర్ 21: మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 25 మంది మహిళా మావోలు ఉండగా.. 12 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు వంటి పలువురు అగ్రనేతలు ఉన్నారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టుల నుంచి పోలీసులు భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 303 రైఫిల్స్, జీ-3 రైఫిల్స్, ఏకే 47లు, ఎస్ఎల్ఆర్‌లు, భారీగా బుల్లెట్స్ స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.

పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన కారణంగానే మావోయిస్టులు బయటికి వచ్చారని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి చెప్పారు. మావోల లొంగుబాటు సందర్భంగా ఆయన పలు అంశాలు వివరించారు. ఏ రకంగా బయటికి వచ్చినా.. మావోయిస్టులను అన్ని విధాలుగా ప్రభుత్వం చూసుకుంటుందని డీజీపీ అన్నారు. మీడియా ద్వారా వచ్చినా, ప్రభుత్వ ఉద్యోగులు ద్వారా వచ్చినా, రాజకీయ నాయకుల ద్వారా వచ్చినా తాము స్వాగతిస్తామని డీజీపీ పేర్కొన్నారు.

మావోయిస్టులు పార్టీ పరంగా విబేధాలు, ఆరోగ్య కారణాలు, ఇలా అనేక కారణాలతో బయటికి వస్తున్నారని డీజీపీ తెలిపారు. 'తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఉన్న ఆజాద్ 30 ఏళ్లగా అజ్ఞాతంలో ఉన్నాడు. ములుగు జిల్లాకు చెందిన ఆజాద్ మీద రూ.20 లక్షల రివార్డ్ ఉంది. అప్పాసి నారాయణ మీద రూ.20లక్షలు రివార్డ్ ఉంది. మిగతా వారికి రూ.25 వేలు చొప్పున ఇస్తున్నామని డీజీపీ తెలిపారు. 11 నెలల్లో 465మంది మావోయిస్టులు లొంగిపోయారని, వీరిలో 59మంది తెలంగాణకు చెందినవారని డీజీపీ వెల్లడించారు.

మావోయిస్టు నేతలు దేవ్ జీ, గణపతి లొంగుబాటుకి ప్రయత్నం చేస్తున్నామని కూడా డీజీపీ చెప్పారు. గణపతి, రాజిరెడ్డి, దేవ్‌జీ , గణేష్, విశ్వనాథ్ తెలంగాణకి చెందిన సెంట్రల్ కమిటీ సభ్యులని.. వీళ్లు ఇంకా అజ్ఞాతంలోనే ఉన్నారని డీజీపీ చెప్పారు. వారు కూడా త్వరలో పోలీసులు ముందుకు లొంగిపోవాలని డీజీపీ శివధర్ రెడ్డి పిలుపునిచ్చారు.

# సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న రాష్ట్రపతి ముర్ము



హైదరాబాద్, నవంబర్ 21: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పుట్టపర్తి చేరుకున్నారు. అక్కడ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబుతో కలిసి సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. అనంతరం ప్రశాంతి నిలయంలో జరిగే శతజయంతి ఉత్సవాల్లో ముర్ము పాల్గొని ప్రసంగించనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం ఢిల్లీకి బయల్దేరి వెళ్లనున్నారు.

కాగా, రాష్ట్రపతి నిన్న తిరుమల శ్రీవారిని దర్శించుకున్న విషయం తెలిసిందే. అనంతరం అక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లారు. రాత్రికి రాజ్‌భవన్‌లో బస చేశారు.

ఇవాళ ఉదయం ప్రత్యేక విమానంలో బేగంపేట నుంచి పుట్టపర్తికి చేరుకున్నారు. పుట్టపర్తి ఎయిర్‌పోర్ట్‌లో ముర్ముకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఇతర అధికారులు స్వాగతం పలికారు.

# సింగూరు డ్యాంను పరిశీలించిన అధ్యయన కమిటీ..

సంగారెడ్డి, నవంబర్ 22: సింగూరు ప్రాజెక్టు మరమ్మతులపై ప్రభుత్వం దృష్టి సారించిన విషయం తెలిసిందే. మరమ్మతుల కోసం ఇటీవల ఏడుగురు సభ్యులతో కూడిన అధ్యయన కమిటీని సర్కార్ ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో ఆనకట్ట మరమ్మతుల కోసం సింగూర్ డ్యాంను అధ్యయన కమిటీ ఈరోజు (శనివారం) పరిశీలించింది. డ్యాంను పూర్తిగా ఖాళీ చేసి మరమ్మతులు చేపట్టాలా లేక కాపర్ డ్యాం నిర్మించి పనులు చేపట్టాలా అనే విషయంలో ప్రత్యక్షంగా కమిటీ పరిశీలన చేసింది. అధ్యయన కమిటీలో ఓఎంసీ చైర్మన్ అంజద్ హుస్సేన్, మిషన్ భగీరథ ఈ.ఎన్.సి కృపాకర్ రెడ్డి, హైదరాబాద్ మెట్రో వాటర్ టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్ ఉన్నారు.

ప్రాజెక్టు ఖాళీ చేస్తే మూడు జిల్లాలకు తాగు నీటి ఇబ్బందులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అధ్యయన కమిటీ చర్చించింది. సింగూరు ప్రాజెక్టులో నిల్వ ఉన్న 16 టీఎంసీల నీటిలో 6 టీఎంసీల నీటిని కిందకి వదిలి 10 టీఎంసీల నిల్వతో మరమ్మతులు చేసే యోచనలో నీటి పారుదల శాఖ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో సాధ్యాసాధ్యాలపై సింగూర్ డ్యాంను అధ్యయన కమిటీ పరిశీలించి.. ఆపై ప్రభుత్వానికి నివేదికను సమర్పించనుంది.

కమిటీ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ప్రాజెక్టు ఆనకట్ట దెబ్బతిన్నదని.. వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే ప్రమాదమని గతంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఎన్‌డీఎస్‌ఏ హెచ్చరికల నేపథ్యంలో మరమ్మతులకు రూ. 26 కోట్లు, ఇతర పనులకు రూ. 61.5 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.

# సైబర్ నేరాలపై అవగాహన, అప్రమత్తత ఉండాల్సిందే: సీపీ సజ్జనార్



హైదరాబాద్, నవంబర్ 21: సైబర్ నేరాలను అడ్డుకునేందుకు సరికొత్త కార్యక్రమానికి హైదరాబాద్ సీపీ సజ్జనార్ శ్రీకారం చుట్టారు. చార్మినార్ వద్ద నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ మీడియాతో మాట్లాడుతూ.. చారిత్రాత్మక చార్మినార్ వద్ద ప్రతి శని, మంగళవారం గడపగడపకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. చార్మినార్ వద్ద ఇవాళ సైబర్ క్రైమ్‌పై అవేర్‌నెస్ కార్యక్రమం ఏర్పాటు చేసి అవగాహన కల్పించే ప్రయత్నం చేశామన్నారు. అవగాహన లేక చాలామంది సైబర్ నేరాల బారిన పడుతున్నారని తెలిపారు.

ఒక్క హైదరాబాద్‌లోనే ప్రతి రోజు కోటి రూపాయలు సైబర్ నేరాల్లో పోగొట్టుకుంటున్నారని వెల్లడించారు. ఓటీపీ ఇన్వెస్ట్‌మెంట్, డిజిటల్ అరెస్ట్ అంటూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అందరూ అవగాహన, అప్రమత్తత కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరస్తులు కాల్ చేసి బెదిరిస్తే భయపడవద్దన్నారు. భయపడితే అది సైబర్ నేరస్తుల బలం అవుతుందని చెప్పుకొచ్చారు. ప్రైవేట్ ఫోటోలు సోషల్ మీడియాలో అప్లోడ్ చేయవద్దని.. అలా చేస్తే మిమ్మల్ని ట్రాప్ చేసి మోసం చేసే అవకాశం ఉందన్నారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 కి కాల్ చేయాలని సూచించారు. సైబర్ సింబా పేరిట వాలంటరీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చామని.. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీపీ సజ్జనార్ పిలుపునిచ్చారు.

# యువత చదువుతో పాటు సాహిత్యంలోనూ ప్రావీణ్యం సాధించాలి : అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్




నల్గొండ, నవంబర్ 22: యువత చదువులోనే కాకుండా, సంస్కృతి, కళలు, సాహిత్యం, పెయింటింగ్ తదితర రంగాల్లో ప్రావీణ్యం సాధించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు. నల్లగొండ జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో 2025- 26 జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను శనివారం ఆయన కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడారు. నేటి యువత తమ ప్రతిభను వెలికితీసి దేశ అభివృద్ధి దిశగా అడుగులు వేయాలన్నారు. స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. యువత శక్తివంతంగా ఉంటే దేశం శక్తివంతంగా ఉంటుందన్నారు.

గమ్యస్థానం చేరుకునే దాకా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. వివేకానందుడు ప్రపంచానికి భారతీయ సంస్కృతి, విలువలు, యువత శక్తిని గుర్తు చేసిన మహానుభావుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ, కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి కాలేజీ ప్రిన్సిపాల్ ఉపేందర్, ఒకేషనల్ ప్రిన్సిపాల్ రాకేంద్, నాగార్జున డిగ్రీ ఓపెన్ కళాశాల ప్రిన్సిపాల్ బొజ్జ అనిల్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మనిషా సింగ్, బాలు పాల్గొన్నారు.

# మత్స్యకారుల ఆర్థిక అభివృద్ధికి ఉచిత చేప పిల్లల పంపిణీ



నల్గొండ, నవంబర్ 22:మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేప పిల్లలను పంపిణీ చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డితో కలిసి పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని ముత్యాలమ్మ చెరువులో శనివారం చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత చేప పిల్లల పథకం మత్స్య వృత్తిదారులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. చేపల పెంపకం వృత్తిగా ఉన్న ముదిరాజ్, బెస్త, గంగపుత్రులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎంతో వెనుకబడి ఉన్నారని, వీరి ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు.

అదేవిధంగా మండల కేంద్రంలో ఇందిరా మహిళ శక్తి చీరలను పంపిణీ చేశారు. అనంతరం గుడెపుకుంట తండాలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవ్, తాసీల్దార్ లాలు నాయక్, ఎంపీడీఓ జానయ్య, కాంగ్రెస్ నాయకుడు పోతు భాస్కర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తూముల భుజంగరావు, మత్స్య శాఖ అధికారి నాగులు నాయక్, యాదగిరి, తూముల సురేశ్ రావు, మండల ప్రత్యేక అధికారి రాము, అనిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రవీణ్, సైదిరెడ్డి పాల్గొన్నారు.

# ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన మంత్రి వాకిటి శ్రీహరి

నారాయణపేట, నవంబర్ 22: ఇందిరా మహిళా శక్తిలో భాగంగా మక్తల్ పట్టణంలో మహిళలకు శనివారం ఇందిరమ్మ చీరలను రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వం మహిళలను నాణ్యమైన చీరలు అందజేస్తుందన్నారు. ప్రధానమంత్రిగా ఇందిరమ్మ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే కుటుంబాలతో పాటుగా, రాష్ట్రం, దేశం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యమన్నారు. హాస్టల్ పిల్లలకు డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలను పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. డిసెంబర్ ఒకటిన రూ.4,500 కోట్ల బడ్జెట్‌తో మక్తల్- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని వివరించారు.

మక్తల్- నారాయణపేట 4 లేన్ ల రహదారికి, నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటగ్రేటెడ్ స్కూల్ భవనాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తదితరులు పాల్గొన్నారు.

# మెలోనీతో మోదీ.. మరోసారి నెటిజన్లను ఆకర్షిస్తున్న 'మెలోడీ' మూమెంట్



న్యూఢిల్లీ, నవంబర్ 22:ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ మంచి స్నేహితులన్న విషయం తెలిసిందే. పలు అంతర్జాతీయ వేదికలపై వీరు ఇరువురూ ఎంతో ఆప్యాయంగా పలకరించుకుంటూ అందరినీ ఆకర్షిస్తుంటారు. తాజాగా వీరి మధ్య స్నేహబంధం మరోసారి నెటిజన్లను ఆకర్షిస్తోంది.

దక్షిణాఫ్రికాలో జీ20 వార్షిక సమావేశం జరుగుతున్న విషయం తెలిసిందే. జోహన్నెస్‌బర్గ్‌లో జరుగుతున్న ఈ సమ్మిట్‌కు ప్రపంచాధినేతలు హాజరయ్యారు. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ కూడా వచ్చారు. ఈ సందర్భంగా స్టేజ్‌పై ఉన్న మెలోనీని ప్రధాని మోదీ ఎంతో ఆప్యాయంగా పలకరించారు. వీరిద్దరి మధ్య జరిగిన సంభాషనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. కాగా, ఇప్పటికే పలుసార్లు వీరిద్దరి ఫొటోలూ వైరల్ అయిన విషయం తెలిసిందే. దుబాయ్‌లో కాప్28 సదస్సు జరిగిన సమయంలో కూడా వీరి సెల్ఫీ ఫొటో వైరల్ అయ్యింది.

# క్రమశిక్షణకు మారుపేరు యువ సైనిక దళం - ఎన్‌సిసి

## (23 నవంబర్ "ఎన్‌సిసి దినోత్సవం" సందర్భంగా)

హెచ్. ఎన్. కుంజ్రూ కమిటీ సిపార్సుల ఆధారంగా 15 జూలై 1948న పార్లమెంట్‌లో 31వ చట్టం ద్వారా 38,500 యువ కెడెట్లతో ప్రారంభమైన నేషనల్ కెడెట్ కోర్ప్స్(ఎన్‌సిసి) లేదా జాతీయ యువసైనిక దళం గత 76 ఏండ్లుగా నేడు 20 లక్షల మంది యువతకు ఎన్‌సిసి శిక్షణనిస్తూ దేశ యువతను సుశిక్షితులను చేయడంలో ఘన విజయాలు నమోదు చేసుకుంటూ నేడు 23 నవంబర్ 2025న (నవంబర్ నాలుగవ ఆదివారం రోజున) 77వ "ఎన్‌సిసి దినోత్సవాన్ని" ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నది. ప్రపంచంలోనే అత్యధిక యువశక్తి కలిగిన యువభారతంలో నేటి యువతకు అవసరమైన క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, నిస్వార్థ సేవానిరతి, దేహదారుద్యం, స్పోర్ట్స్ క్రీడల స్ఫూర్తి పెంపొందించడం, యువతను త్రివిధ దళాల పట్ల ఆకర్షించడం, మానసిక వికాసం, బాధ్యతగల పౌరుల నిర్మాణం లాంటి ఉత్తమ గుణాలు అలవడే విధంగా నిర్దిష్టమైన కార్యాచరణ అమలు చేస్తూ నేడు ప్రపంచంలోనే అతి పెద్ద యూనిఫామ్ ధరించే యువశక్తిగా ఎన్‌సిసి అందరి మన్ననలు పొందడం హర్షదాయకం. "ఏకత – క్రమశిక్షణ" లేదా "యునిటీ అండ్ డిసిప్లెన్" అనే నినాదంలో ముందుకు సాగుతున్న ఎన్‌సిసిలో ఆర్మీ, నావీ, ఏయిర్ ఫోర్స్ అనే త్రివిధ యువదళాలు ఉన్నాయి.

ఎన్‌సిసి మహోన్నత లక్ష్యాలు:

ప్రతి ఏట నవంబర్ మాసం నాలుగవ ఆదివారం రోజున, అనగా 23 నవంబర్ 2025న దేశవ్యాప్తంగా 77వ జాతీయ యువ సైనిక దళం దినోత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. ఎన్‌సిసి శిక్షణ, పాఠ్యాంశాల్లో త్రివిధ దళాల పరిచయం, దేశ మిలటరీ చరిత్ర, యుద్ధ నైపుణ్యాలు, దేశ సమగ్రత, ఆయుధాల శిక్షణ, సాయుధ కవాతులు, జాతీయ సమైక్యత ప్రాధాన్యం, మత సామరస్యం, లౌకిక వాదం, పర్యావరణ పరిరక్షణ, ప్రథమ చికిత్స, యుద్ధనీతి లాంటి అనేక అంశాల్లో బోధనతో పాటు శిక్షణ కూడా ఇవ్వడం జరుగుతుంది. శిక్షణ పొందిన యువతకు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్ ఏ, బి, సి అనే పత్రాలను అందజేస్తారు. ఈ సర్టిఫికెట్లు పొందిన యువతకు పలు ప్రభుత్వరంగ సంస్థలు కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో శిక్షణలు కల్పిస్తారు.

ఎన్‌సిసి విస్తరణ:

ఢిల్లీ ప్రధాన కేంద్రంగా సేవలందిస్తున్న ఎన్‌సిసిలో దేశవ్యాప్తంగా 17 డైరెక్టరేట్లు, 96 ఎన్‌సిసి గ్రూపులు, 684 ఆర్మీ యూనిట్లు, 69 నావల్ యూనిట్లు, 61 ఎయిర్‌ఫోర్స్ యూనిట్ల ద్వారా పాఠశాల (8,9,10 తరగతులు), కళాశాల(11, 12, డిగ్రీ, పిజీ)లకు చెందిన ఎంపిక చేసిన విద్యార్థినీవిద్యార్థులకు శిక్షణ సేవలను అందుతున్నాయి. ఆర్మీ యువతకు ఖాకీ, నావల్ కెడెట్లకు తెలుపు, ఏయిర్‌ఫోర్స్ కెడెట్లకు స్కై బ్లూ రంగు యూనిఫామ్ డ్రస్సులు ఉంటాయి. శిక్షణలో భాగంగా విద్యాలయాల్లో తరగతులు/ కవాతులు, శిబిరాల ద్వారా ఆయుధ శిక్షణలు, యూత్ ఎక్సఛేంజ్ పథకాలు లాంటి పలు అంశాలు అమలు పరుస్తారు. నేడు కేంద్ర ప్రభుత్వం చొరవతో గతంలో 14 లక్షల కెడెట్ల నుంచి ప్రస్తుతం 20 లక్షల కెడెట్లకు శిక్షణలు ఇస్తూ, రానున్న రోజుల్లో 30 లక్షల వరకు పెంచడానికి దశాబ్దకాల ప్రణాళికలు అమలు పరుస్తున్నారు.

ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాల్లో ఎన్‌సిసి:

నేడు తెలంగాణ/ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల ఎన్‌సిసి సేవలు హైదరాబాదు కేంద్రంగా ఎన్‌సిసి జైరెక్టరేట్ నాయకత్వంలో ప్రతి ఏట 1.4 లక్షల మంది కెడెట్లు శిక్షణ పొందుతున్నారు. తెలంగాణలో 4 ఎన్‌సిసి గ్రూపులు, ఆంధ్రలో 5 గ్రూపులతో 67 ఎన్‌సిసి బెటాలియన్లు శిక్షణలో నిమగ్నం అయ్యాయి. ప్రతి విద్యార్థికి ఎన్‌సిసి శిక్షణను విధిగా నేర్పించాలనే వాదం ఎంతో కాలంగా వినిపిస్తున్నది. దీనిని వాలంటరీ సంస్థగా కాకుండా కంపల్సరీ శిక్షణగా నేటి యువతకు దేశభక్తిని నూరి పోయాల్సి ఉందనే వాదనలు సర్వత్ర వినిపిస్తున్నాయి. కొన్ని దేశా?? విద్యా విధానంలోనే ఇలాంటి శిక్షణలను సెలబస్‌గా అమలు చేయడం, డిగ్రీ తర్వాత కొంత కాలం పాటు తప్పనిసరిగా సైన్యంలో పని తేయడం అమలు జరుగుతున్న విషయాలను మరువరాదు.

ఒక అమాయక యువకుడు లేదా యువతిని బాధ్యతగల ఆకర్షణీయ వ్యక్తిత్వం కలిగిన పౌరుడిగా తీర్చి దిద్దడంలో ఎన్‌సిసి చేస్తున్న కృషిని ప్రస్తుతిద్దాం, మన పిల్లలకు ఎన్‌సిసి శిక్షణను తప్పనిసరి చేద్దాం.

–డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఎర్ర చందనం భద్రత, సంరక్షణ కోసం ఆంధ్రప్రదేశ్‌కు రూ.39.84 కోట్లు విడుదల చేసిన ఎన్‌బీఏ

న్యూఢిల్లీ, నవంబర్ 22: భారత్ జీవవైవిధ్య సంరక్షణ ప్రయత్నాలను ప్రోత్సహించే దిశగా, జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ (ఎన్‌బీఏ) ప్రతిష్ఠాత్మక ఎర్ర చందనం భద్రత, సంరక్షణలను దృష్టిలో పెట్టుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ విభాగానికి రూ.38.36 కోట్లనూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య మండలికి రూ.1.48 కోట్లనూ విడుదల చేసింది. దీంతో పాటే భారత్ అమలు చేస్తున్న లభ్యత, లాభాల పంపిణీ (యాక్సెస్ అండ్ బెనిఫిట్ షేరింగ్..ఏబీఎస్) పద్ధతిలో చేసిన చెల్లింపులు రూ.110 కోట్లను దాటిపోయాయి. ఇది, దేశంలో జీవవైవిధ్య సంరక్షణకు ఏబీఎస్ రూపంలో ఇంతవరకు చేసిన అతి భారీ చెల్లింపుల్లో ఒకటి అని చెప్పవచ్చును.

ఎర్ర చందనం బాగా ఎర్రనైన కలపను అందిస్తూ ప్రపంచమంతటా ప్రసిద్ధి చెందింది. ఈ జాతి చెట్లు మన దేశ తూర్పు కనుమలలోని కొన్ని ప్రాంతాల్లోనే, మరీముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, చిత్తూరు, కడప, ప్రకాశంతో పాటు కర్నూలు జిల్లాల్లో మాత్రమే సహజ సిద్ధంగా పెరుగుతున్నాయి. స్వాధీనం చేసుకున్న లేదా వేలం వేసిన ఎర్ర చందనం ద్వారా లాభాలను ఆంధ్రప్రదేశ్ అటవీ విభాగంతో కలిసి పంచుకునే పద్ధతిలో రూ.87.68 కోట్ల ఆదాయం లభించింది.

ఎర్ర చందనం సంరక్షణ, పరిశోధన కోసం ఆంధ్రప్రదేశ్, కర్నాటక, ఒడిశా అటవీ విభాగాలతో పాటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవవైవిధ్య మండలికి ఇంతవరకు రూ.49 కోట్లను ఎన్‌బీఏ విడుదల చేసింది. దీనికి అదనంగా, ఆంధ్రప్రదేశ్‌లో 198 మంది రైతులకూ, తమిళనాడులో 18 మంది రైతులకూ రూ.3 కోట్లను పంపిణీ చేశారు.

ఆంధ్రప్రదేశ్ అటవీ విభాగానికి ఇప్పుడిచ్చిన రూ.38.36 కోట్లు అటవీ సిబ్బందికి మరింత ప్రోత్సాహాన్ని అందించడం, పరిరక్షణ చర్యలను ఇప్పటితో పోలిస్తే పెంచడం, ఎర్ర చందన అడవుల శాస్త్రీయ నిర్వహణను ప్రోత్సహించడం, జీవవైవిధ్య నిర్వహణ సంఘాల ద్వారా జీవనోపాధి అవకాశాలను కల్పించడంతో పాటు దీర్ఘకాలిక పర్యవేక్షణ కార్యక్రమాన్ని బలపరచడానికి తోడ్పడుతుంది. దీంతో ఈ అరుదైన కలపను అందించే వృక్ష జాతులకు ఉజ్వల భవితను అందించే దిశగా ఓ ప్రధాన నిర్ణయాన్ని తీసుకున్నట్లయింది.

దీంతో పాటు, రూ.2 కోట్ల ఖర్చుతో ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి ఆధ్వర్యంలో ఒక లక్ష ఎర్రచందనం మొక్కలను పెంచాలన్న కార్యక్రమానికి కూడా ఎన్‌బీఏ ఆమోదాన్ని తెలిపింది. ఇందులో కొంత సొమ్మును ఇంతకుముందే విడుదల చేశారు. మిగిలిన రూ.1.48 కోట్లను ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలికి ఇచ్చారు. ఈ మొక్కలను పెంచి, వాటిని రైతులకు ఇస్తారు. దీంతో అడవుల్లో కాకుండా ఇతర చోట్ల మొక్కల పెంపకం (ట్రీస్ అవుట్‌సైడ్ ఫారెస్ట్స్.. టీఓఎఫ్) కార్యక్రమానికి దన్ను లభించడంతో పాటు, ఈ అరుదైన వృక్ష జాతిని దాని సహజ స్థలానికి ఆవల పెంచడానికి కూడా తోడ్పడినట్లు అవుతుంది.

ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం ఏబీఎస్ ఏ విధంగా ప్రపంచ జీవవైవిధ్య సిద్ధాంతాల ఆచరణలో నాయకత్వాన్ని ప్రోత్సహించి భారత్ విజయాలకు తోడ్పడగలుగుతుందో సూచిస్తుంది. అంతేకాక, ఇది సంరక్షణతో ముడిపడ్డ లాభాలు స్థానికులకూ, రైతులకూ, జీవవైవిధ్య సంరక్షకులకూ అందేటట్లు కూడా చూస్తుంది. మన సమృద్ధ జీవశాస్త్ర వారసత్వాన్ని దేశ భావి తరాల అవసరాల్ని దృష్టిలో పెట్టుకొని పరిరక్షించడానికి రాష్ట్రాల జీవవైవిధ్య మండలులు, అటవీ విభాగాలు, జీవవైవిధ్య నిర్వహణ సంఘాలు, స్థానిక ఆసక్తిదారులతో పాటు ఎన్‌బీఏ తాను కూడా కలిసి కృషి చేస్తూనే ఉంటుంది.

# కాంగ్రెస్ పార్టీకి రివేంజ్ రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదు

**–రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

హైదరాబాద్ నవంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్); కాంగ్రెస్ పార్టీకి రివేంజ్ రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఫార్ములా– ఈ రేసు కేసులో కెటిఆర్ నిబంధనలు ఉల్లంఘించారని ఆయన అన్నారు. ఇందులో ఎవరికీ ఎటువంటి అనుమానం అవసరం లేదన్నారు. చట్టం తనపని తాను చేసుకుంటూ పోతుందని ఆయన తెలిపారు. కెటిఆర్‌పై రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, కూట్ర పూరితంగానే ఫార్ములా–ఈరేసు కేసులో ఇరికిస్తున్నారని బిఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ బిఆర్ ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలను మంత్రి కోమటిరెడ్డి ఖండించారు. ఈ సందర్భంగా మంత్రి కోమ టిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు తమ ను నమ్మి అధికారం ఇచ్చారని, ప్రస్తుతం రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఆయన తెలిపారు.

# మాస్టర్‌క్లాస్ సిరీస్‌ను జెండా ఊపి ప్రారంభించిన శ్రీ లోగనాథన్ మురుగన్ ..

న్యూఢిల్లీ, నవంబర్ 22: గోవాలోని కళా అకాడమిలో నేడు 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఇఫి 2025) మాస్టర్‌క్లాస్ సిరీస్ ను సమాచార, ప్రసార శాఖ, పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి శ్రీ లోగనాథన్ మురుగన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సమాచార, ప్రసార శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు, సంయుక్త కార్యద్శి డాక్టర్ అజయ్ నాగభూషణ్, ప్రముఖ దర్శకుడు శ్రీ ముజాఫర్ అలీ, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ ముఖ్య అధికారి శ్రీ ప్రాష్ మాగ్దం, నిర్మాత శ్రీ రవి కొత్తరాకరా పాల్గొన్నారు.

ఈ ఏడాది తొలిసారి సాధారణ ప్రజల సమక్షంలో మాస్టర్ క్లాస్ ప్రారంభోత్సవం నిర్వహించడం చారిత్రక మైలురాయిగా నిలిచింది. ఇది అందరికీ అందుబాటులో ఉండే విధంగా, విస్తృత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంపై చలనచిత్రోత్సవానికి ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తుంది.

ఈ సందర్భంగా శ్రీ లోగనాథన్ మురుగన్ మాట్లాడుతూ.. ఇఫి 2025లో 200కు పైగా సినిమాలు ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా దేశంలో పెరుగుతున్న సినిమా ప్రభావాన్ని సూచిస్తుందని తెలిపారు. ఈ చిత్రోత్సవం వికసిత్ భారత్ దిశగా దేశ ప్రయాణంతో ముడిపడి ఉందని, సృజనాత్మక ప్రతిభను ప్రపంచవ్యాప్తంగా విస్తరించాలనే భారత లక్ష్యాన్ని పునరుద్ఘాటిస్తుందని ఆయన పేర్కొన్నారు. మహిళా దర్శకుల భాగస్వామ్యాన్ని, సహకారాన్ని మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ సంవత్సరం మహిళలు దర్శకత్వం వహించిన 50 సినిమాలను ప్రదర్శించబోతున్నట్లు తెలిపారు. ఇది ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్ఫూర్తితో.. నారీ శక్తి, మహిళా సాధికారతపై ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు.

ఇఫి 2025 మాస్టర్‌క్లాస్ సదస్సులో విస్తృతమైన జ్ఞాన భాగస్వామ్య కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వాటిలో నిపుణుల చర్చలు, వర్క్‌షాప్‌లు, రౌండ్ టేబుల్ సమావేశం, ఇంటర్వ్యూ కార్యక్రమాలు, మాటా మంతీ, సంభాషణాత్మక వర్క్‌షాప్‌లు ఉండనున్నాయి. విధు వినోద్ చోప్రా, అనుపమ్ ఖేర్ ముజఫర్ అలీ, షాద్ అలీ, శేఖర్ కపూర్, రాజ్‌కుమార్ హిరాణీ, ఆమిర్ ఖాన్, విశాల్ భరద్వాజ్, సుహాసిని మణిరత్నం వంటి సినీ ప్రముఖులు ఈ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

ముఖ్యంగా ప్రముఖ దర్శకుడు శ్రీ ముజాఫర్ అలీ మాస్టర్‌క్లాస్ సిరీస్ ప్రారంభ కార్యక్రమాన్ని నిర్వహించి, భవిష్యత్తు సమావేశాల నిర్వహణకు తొలి అడుగు వేశారు.

ఈ ఏడాది మాస్టర్‌క్లాస్‌లలో సమకాలీన, భవిష్యత్తు దృష్టిగల అంశాలు కొత్తగా చర్చలోకి రానున్నాయి. వాటిలో కృత్రిమ మేధ, సుస్థిరత, సినిమాటోగ్రఫీ, వీఎఫ్ఎక్స్, ఎస్ఎఫ్ఎక్స్ వంటి సాంకేతిక వర్క్‌షాప్‌లు ప్రత్యేకంగా ఉండనున్నాయి. వీటితో పాటు థియేటర్ నటనపై ప్రముఖ పరిశ్రమ నిపుణులు నిర్వహించే మాస్టర్‌క్లాస్‌ల ప్రదర్శన కూడా ఉండనుంది.

ఈ ఏడాది ఇఫి వేడుకలకు ఆస్ట్రేలియా, జపాన్, జర్మనీ, కెనడా దేశాల నుంచి హాజరయ్యారు. ఇది చలనచిత్రోత్సవ స్థానాన్ని ప్రపంచస్థాయి సినిమా వేదికపై మరింత బలోపేతం చేసింది.

ఇఫి వార్షిక సంప్రదాయంలో భాగంగా భారత సినీ రంగానికి అందించిన విశేషమైన సహకారాన్ని గౌరవిస్తూ.. ఈ ఏడాది భారత నైటింగేల్ లతా మంగేశ్కర్, సినిమా దిగ్గజం గురుదత్‌లకు నివాళులు అర్పించారు.

# మహిళా శక్తి చీరల పంపిణీ

**–రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, పరిశ్రమలు శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి**




గజ్వేల్ , నవంబర్ 22: తెలంగాణ ప్రగతి ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం గజ్వేల్ ఐఓసి లో కార్యాలయంలో నియోజకవర్గం లోని మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఇంచార్జ్, రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, పరిశ్రమలు, గనుల, భూ గర్భశాస్త్ర శాఖ మంత్రి జీ.వివేక్ వెంకటస్వామి హాజరై మహిళలకు చీరల పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మహిళ అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు.

గజ్వేల్ నియోజకవర్గంలో 54 వేల చీరలు పంపిణీ చేయనున్నామని తెలిపారు.

తెలంగాణ గీతాలాపన సమయంలో చాలా మంది మహిళలు గేయాన్ని ఆలపించడం జరిగిందని రాష్ట్ర గీతాని కున్న ప్రాముఖ్యత తెలియజేస్తుందన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళ అభ్యున్నతికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మహిళలను అన్ని రంగాల్లో బలోపేతం చేయడానికి మహిళా శక్తి పెంచడానికి వారే స్వంతంగా ఆదాయం సంపాదించడం కోసం కుటుంబానికి పోషించడం కోసం అనేక పథకాలు చేపట్టారని పేర్కొన్నారు. స్కూల్ యూనిఫాం, 28 కోట్ల వడ్డీలేని రుణాలు, బ్యాంక్ లింకేజీ కార్యక్రమంలో 600 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం అంది స్తుందన్నారు. ఉచిత బస్సు కోసం 8 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఈ పథకాన్ని చాలా మంది మహిళలు ఉపయోగించు కుంటున్నారన్నారు. రేషన్ సన్నబియ్యం పంపిణీ 12వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరవాత మహిళలకు ఇష్టమైన రంగులతో చీరలను మన రాష్ట్రంలో సిరిసిల్ల, కరీంనగర్‌లో తయారు చేసిన చీరలను పంపిణీ చేస్తుందన్నారు.

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చేసిన సేవలు గుర్తు చేసుకుంటూ వారి పేరు మీదుగా ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ అని నామకరణం చేశామన్నారు.

కొత్త రేషన్ కార్డులు, 200 యూనిట్ ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలు మహిళకు మేలు చేయడానికే ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్లు ఇప్పటి వరకు 11వేల శాంక్షన్ పత్రాలు అందజేశామని, అందులో 9వేల ఇల్లు నిర్మాణంలో బేస్ మెంట్ పేమెంట్ 1లక్ష రూపాయలు అకౌంట్ లో పడ్డాయని. మిగతా పేమెంట్ సైతం నిర్మాణం కాగానే వస్తాయన్నారు. మిగిలిన లబ్ధిదారులకు ఇంకో విడతలో తప్పకుండా ఇళ్ళు మంజూరు చేస్తామని బరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి ఎమ్మెల్సీ యాదవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు..



అమరావతి, నవంబర్ 22:ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో రాజీ పడవద్దు అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులను ఆదేశించారు. భీమవరం కొత్త బస్టాండ్ ఆర్టీసీ కాంప్లెక్స్ లో మరమ్మత్తుల్లో ఉన్న టాయిలెట్స్ ను రూ.14.5 లక్షల వ్యయంతో తిరిగి మరమ్మత్తులు చేసిన అనంతరం శనివారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాటాడుతూ.. జిల్లాకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించే విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడవద్దని సూచించారు. ప్రాంగణంలో ఉన్న అన్ని టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచేందుకు తగినంత సిబ్బందిని నియమించాలన్నారు.

పరిశుభ్రమైన మరుగుదొడ్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రయాణికులకు ఆరోగ్య భద్రత కల్పించిన వారము వుతామన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసిన తర్వాత ఆక్యేన్స్ పెరిగిందని అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రాంగణమంతా పరిశుభ్రంగా ఉంచడంతోపాటు మొక్కలను కూడా నాటించాలని సూచించారు. మరుగుదొడ్లు మెయింటినెన్స్ లేక పోతే ఓపెన్ యూరినల్స్ కు ఎక్కువ అవకాశం ఉందని, ఇది బస్సు ప్రాంగణం లోనికి వచ్చే వారికి చాలా ఇబ్బందికరంగా ఉంటుందని తెలిపారు. బస్సు ప్రాంగణంలో ఎట్టి పరిస్థితుల్లో బహిరంగ యూరినల్స్ లేకుండా చూడాలని ఆదేశించారు. మరుగుదొడ్లు నిరంతరాయంగా శుభ్రపరుస్తూ ఉంటే బహిరంగ యూరినల్స్ కు ఆస్కారం ఉండదన్నారు. ఆర్టీసీ ప్రాంగణంలో ఉన్న క్యాంటీన్ ను డిపో మేనేజర్ ఆకస్మికంగా సందర్శించి స్వయంగా ఆహార పదార్థాలను రుచి చూడాలని ఆదేశించారు. క్యాంటీన్ పరిశుభ్రత, ఆహార పదార్థాలలో నాణ్యత లేకపోతే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని ఆదేశించారు. పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బస్సు ప్రాంగణం లో బస్సు కోసం వేచి ఉన్న మహిళ ప్రయాణికులతో, మహిళా కండక్టర్లతో కొద్ది సమయం మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్.వి.బి వరప్రసాద్ మాట్లాడుతూ గతంలో సుమారు 25 వేల మంది మహిళలు ప్రతిరోజు బస్సులలో ప్రయాణించే వారని, ఉచిత బస్సు ఏర్పాటు చేసిన తర్వాత సుమారు 38వేల మంది మహిళలు ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు అనుగుణంగా బస్ డిపోలో మరమ్మత్తులకు గురైన టాయిలెట్స్ ను తిరిగి మరమ్మత్తులు చేసి సిద్ధం చేయడం జరిగిందన్నారు. ఒకటవ బ్లాక్‌లో పురుషులకు 4, మహిళలకు 4 టాయిలెట్స్ ను, ప్రత్యేకంగా పురుషులకు యూరినల్స్ కు 6 బ్లాక్ లను, అలాగే రెండవ బ్లాక్ అమలాపురం బస్సు పాయింట్ నందు పురుషులకు 4, మహిళలకు 4 మరుగుదొడ్లు, యూరినల్స్ కు 6 బ్లాక్స్, పురుషులకు స్నానం చేసే సౌకర్యాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఉచిత బస్సు ఏర్పాటు చేసిన తరువాత మహిళలు ఎక్కువగా పాలకొల్లు, తాడేపల్లి గూడెం, రాజమండ్రి సర్వీసులలో ప్రయాణి స్తున్నట్లు తెలిపారు. సిబ్బంది రెస్ట్ రూమ్స్ ని కూడా రూ.3 లక్షల వ్యయం తో రెన్నోవేషన్ చేస్తున్నట్లు తెలిపారు. చివరిగా బస్సు ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్.వీ.ఆర్ వరప్రసాద్, డిపో మేనేజర్ వై.వేణు, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, తహసిల్దార్ రావి రాంబాబు, ఆర్టీసీ పీఓ ఎల్.గీతవాణి, ఓ.పీ .డీ ఆర్.బాలసుబ్రమణ్యం, ఏవో ఎస్.వి రావు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై కీలక జీవో

హైదరాబాద్, నవంబర్ 21: తెలంగాణ లో గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న కీలక అడుగు పడింది. ఐదేళ్లుగా నిరవధికంగా కొనసాగుతున్న పంచాయతీ ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల ఖరారుకు మార్గదర్శకాలతో కూడిన ముఖ్యమైన జీవోను విడుదల చేసింది.

డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదికకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలుపడంతో సర్పంచ్ వార్డు మెంబర్ల రిజర్వేషన్లకు విధివిధానాలను ఖరారు చేస్తూ ఇవాళ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జీవో నెం.46ను విడుదల చేశారు. అయితే, దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రిజర్వేషన్లు 50 శాతం మించకుండా ఈ మార్గదర్శకాలు జారీ అయ్యాయి. అయితే, ప్రస్తుతం ఇచ్చిన జీవోకు అనుగుణంగా ఎంపీడీవోలు వార్డులకు, ఆర్డీవోలు సర్పంచి పదవులకు రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. రాజకీయ పార్టీల సమక్షంలో లాటరీ పద్ధతి లో మహిళలకు సీట్లు కేటాయిస్తారు.

# దక్షిణాఫ్రికా పర్యటనకు బయలుదేరే ముందు ప్రధానమంత్రి ప్రకటన

న్యూఢిల్లీ, నవంబర్ 22:దక్షిణాఫ్రికా అధ్యక్షతన జోహెన్నెస్‌బర్గ్‌లో జరుగుతున్న జీ20 నాయకుల 20వ సదస్సులో పాల్గొనాలన్న శ్రీ సిరిల్ రామఫోసా ఆహ్వానం మేరకు 2025 నవంబర్ 21 నుంచి 23 వరకు ఆ దేశంలో పర్యటిస్తాను.ఆఫ్రికాలో జరుగుతున్న తొలి జీ20 సదస్సు కావడంతో ఇది చాలా ప్రత్యేకమైనది. భారత్ అధ్యక్షతన 2023లో జరిగిన జీ20 సదస్సులో ఆఫ్రికన్ యూనియన్ సభ్య దేశంగా మారింది. ముఖ్యమైన అంతర్జాతీయ సమస్యలను చర్చించేందుకు ఈ సదస్సు ఓ మంచి అవకాశం. 'ఐక్యత, సమానత్వం, స్థిరత్వం' అనే ఇతివృత్తంతో జరుగుతున్న ఈ ఏడాది జీ20 ద్వారా గతంలో భారత్‌లోని న్యూఢిల్లీ, బ్రెజిల్లోని రియోడి జనీరోలో నిర్వహించిన సదస్సుల ఫలితాలను దక్షిణాఫ్రికా ముందుకు తీసుకెళుతుంది. 'వసుధైక కుటుంబం', 'ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు' అన్న మన లక్ష్యానికి అనుగుణంగా భారత్ దృక్పథాన్ని నేను ఈ సదస్సులో వివరించారు.

# నల్గొండలో కొత్త ఎఫ్‌సీఐ డివిజనల్ కార్యాలయాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి




నల్గొండ, నవంబర్ 22:కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖల మంత్రి శ్రీ ప్రహ్లాద్ జోషి ఈ రోజు నల్గొండలో భారత ఆహార సంస్థ నూతన డివిజనల్ కార్యాలయాన్ని ప్రారంభించారు. తెలంగాణతో పాటు దక్షిణ ప్రాంతంలో ఎఫ్‌సీఐ కార్యాచరణ సామర్థ్యం, సేవల పంపిణీని ఇది మరింత బలోపేతం చేస్తుందన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎఫ్‌సీఐ ఆధునికీకరణ... సమర్థవైన, పారదర్శకవైన, ప్రజా-కేంద్రితవైన ఆహార భద్రతా కార్యకలాపాలను నిర్ధరించడం పట్ల భారత ప్రభుత్వ నిబద్ధతను ఈ కొత్త కార్యాలయం ప్రతిబింబిస్తుందని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు.

తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం అందిస్తున్న గణనీయ మద్దతును శ్రీ జోషి ప్రధానంగా ప్రస్తావించారు. రైల్వే రంగ అభివృద్ధి కార్యక్రమాల కింద 2024?25 కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రూ. 5,336 కోట్లు అందుకుందన్నారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ. 1,830.4 కోట్ల వ్యయంతో రాష్ట్రంలోని 38?40 రైల్వే స్టేషన్లను అధునాతన హంగులతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 100 శాతం రైల్వే విద్యుదీకరణ పూర్తయినట్లు కేంద్ర మంత్రి తెలిపారు. 'పీఎమ్ సూర్య ఘర్-ముఫ్త్ బిజిలీ యోజన' కింద కేంద్రం 40.5 మెగావాట్ల పరిశుద్ధ ఇంధన సామర్థ్యాన్ని జోడిస్తూ... 20,175 ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ గృహాల వారికి మొదటి విడతగా 2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను అందించేందుకు సూత్రప్రాయంగా ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆయన వివరించారు.

రైతులకు ఎఫ్‌సీఐ అందిస్తున్న బలమైన మద్దతునూ కేంద్ర మంత్రి ప్రధానంగా ప్రస్తావించారు. ఈ సంస్థ ప్రతి సంవత్సరం కనీస మద్దతు ధర చెల్లిస్తూ ధాన్యం సేకరించడం ద్వారా ఏటా 1.27 కోట్ల మంది రైతులకు సహాయాన్ని అందిస్తుందనీ, 2023?24లోనే రూ. 2.25 లక్షల కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా బదిలీ చేశామని ఆయన పేర్కొన్నారు. పంపిణీ విషయంలో ఎఫ్‌సీఐ "శక్తిమంతమైన నెట్‌వర్క్ ప్రతి నెలా 80 కోట్లకు పైగా లబ్ధిదారులకు ఆహారం అందిస్తోందని ? ఈ సంఖ్య యునైటెడ్ స్టేట్స్, యూరోపియన్ యూనియన్ జనాభా కంటే ఎక్కువ" అని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార భద్రతా కార్యక్రమం కింద ఏటా 550 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఆహార ధాన్యాలు పంపిణీ చేస్తున్నట్లు శ్రీ జోషి తెలిపారు.

జాతీయ ఆహార భద్రతా చట్టం కింద తెలంగాణ పూర్తి కవరేజీని సాధించిందనీ, 1.97 కోట్ల మంది లబ్ధిదారులు ఎటువంటి లోటు లేకుండా తమ సరుకులను పొందుతున్నారని శ్రీ జోషి పేర్కొన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం నెలవారీగా 1,07,000 మెట్రిక్ టన్నుల బియ్యం, 3,770 మెట్రిక్ టన్నుల గోధుమలు సహా 1,11,000 మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాలను కేటాయించడం ద్వారా మద్దతునిస్తోందని కేంద్ర మంత్రి వివరించారు.

రైతులకు మద్దతునివ్వడం, ఆహార భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం, తెలంగాణలో సమగ్ర అభివృద్ధిని ముందుకు నడిపించడం పట్ల కేంద్ర ప్రభుత్వ నిబద్ధతను శ్రీ జోషి పునరుద్ఘాటించారు.

## 5 కూనలకు జన్మనిచ్చిన మన చిరుత- ముఖి సంతాన వృద్ధి, వైవిధ్యమైన జన్యువులు గల చిరుత జాతి జనాభా పెరగటంపై ఆశావాద దృక్పథం: శ్రీ భూపేందర్ యాదవ్

న్యూఢిల్లీ, నవంబర్ 22:ప్రాజెక్టు చీతాలో భాగంగా జరిగిన చరిత్రాత్మకమైన అభివృద్ధిని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు శాఖ మంత్రి శ్రీ భూపేందర్ యాదవ్ వెల్లడించారు. భారత్ లో జన్మించి, 33 నెలల వయసు గల మొదటి ఆడ చిరుత- ముఖి 5 కూనలకు జన్మనిచ్చిందని, భారత్‌లో మళ్లీ చిరుతలను పెంచే కార్యక్రమంలో ఇది కీలక విజయమని సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్‌లో శ్రీ భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు.

భారత్‌లో పుట్టిన చిరుత విజయవంతంగా పిల్లలను కనటం ఇటీవల కాలంలో ఇదే ప్రథమమని శ్రీ భూపేందర్ యాదవ్ స్పష్టం చేశారు. భారతదేశ ఆవాసాల్లో ఈ జాతి చిరుతలు స్థానిక వాతావరణానికి అలవాటుపడటం, ఆరోగ్యంగా ఉండటం, దీర్ఘకాలిక మనుగడకు ఇది సంకేతమని ఆయన తెలిపారు.

తల్లి, పిల్లలూ ఆరోగ్యంగా ఉన్నాయని వెల్లడించిన మంత్రి.. "భారత్‌లో స్వయంగా సంతతిని వృద్ధి చేసుకోగల, వైవిధ్యమైన జన్యువులు గల చిరుత జనాభాను పెంచటంపై ఆశావాద దృక్పథాన్ని ఈ పరిణామం బలపరుస్తుంది" అని అన్నారు.ఈ విజయం పట్ల ఆనందం వ్యక్తం చేసిన శ్రీ భూపేందర్ యాదవ్.. జీవజాల రక్షణకు భారత్ చేస్తున్న ప్రయత్నాలు, ప్రాజెక్టు చీతా భవిష్యత్తుపై నమ్మకాన్ని పెంచుతుందని తెలిపారు.

# అత్యుత్తమ ప్రదర్శనకు సిద్ధమైన ప్రతిభావంతులు!




న్యూఢిల్లీ, నవంబర్ 22: ప్రతిభావంతులంతా తమ అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శనకు సిద్ధంగా ఉన్నారు! దేశపు తదుపరి తరం సృష్టికర్తలు ఉత్సాహంగా తమ ప్రతిభను ప్రదర్శించే వేదికగా 'రేపటి సృజనాత్మక మేధస్సు-2025' కార్యక్రమం ఐదో ఎడిషన్ ఈ రోజు గోవాలో ప్రారంభమైంది. దేశంలోని అత్యంత ప్రతిభావంతులైన, వర్ధమాన యువ చిత్రరూపకర్తల కోసం గోవా అధునాతన రంగస్థలంగా సిద్ధమైంది.

125 మంది వర్ధమాన తారలు 48 గంటల చిత్ర రూపకల్పన సవాలు కోసం సిద్ధమై రంగంలోకి దిగుతున్నారు. ఇక్కడ ఆలోచనలు... సృజనాత్మకత, సహకారం, సినిమాటిక్ మాయాజాలాల సుడిలో స్క్రిప్ట్ నుంచి స్క్రీన్ దాకా పరుగెత్తుతాయి. ఇది కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదు... రేపటి దర్శకులు, నటులు, కథకులు వారి సొంత బ్లాక్‌బస్టర్ కథలను రూపొందించడాన్ని ప్రారంభించే అద్భుతమైన వేదిక ఇది.

సమాచార, ప్రసార, పార్లమెంటరీ వ్యవహారాల శాఖల సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ ఈ పోటీలను ప్రారంభించారు. పాల్గొనేవారి అభిరుచిని, సృజనాత్మకతనూ ప్రశంసించారు. 2021 నుంచి ఈ కార్యక్రమం నిరంతర వృద్ధిని ఆయన కొనియాడారు. యువ కథకులకు అంతర్జాతీయ వేదికను అందించినందుకు సీఎమ్‌వోటీని అభినందించారు. "ఈ వేదిక దేశంలోని వర్ధమాన సృజనకర్తలను ప్రపంచ నిర్మాతలు, సృజనాత్మక నెట్ వర్క్‌లతో అనుసంధానిస్తోంది. ఇది కేవలం చలనచిత్ర నిర్మాణం గురించి మాత్రమే కాదు - ఇది దేశ సృజనాత్మక భవిష్యత్తును రూపొందించడం గురించినది" అని ఆయన అన్నారు.

"ఈ అధిక ఒత్తిడితో కూడిన అనుభవాలు మీ నైపుణ్యాలను మరింత పదును పెడతాయి... మీ అత్యుత్తమ ప్రదర్శనను వెలికితీస్తాయి" అని స్పష్టం చేస్తూ... 48 గంటల చిత్ర రూపకల్పన సవాలును స్వీకరించాలని డాక్టర్ మురుగన్ పాల్గొనేవారిని ప్రోత్సహించారు. శక్తిమంతమైన, ఆవిష్కరణ-ఆధారితమైన సృజనాత్మక రంగం కోసం ప్రధానమంత్రి దార్శనికతకు అనుగుణంగా... ప్రతిభను ప్రోత్సహించడానికి, దేశ సృజనాత్మక వ్యవస్థను బలోపేతం చేయడానికి, ఆరెంజ్ ఆర్థిక వ్యవస్థను మరింత ముందుకు నడిపించడానికి ముంబయిలో కొత్తగా ప్రారంభించిన భారతీయ సృజనాత్మక సాంకేతికతల సంస్థ ఏర్పాటుతో పాటు ప్రభుత్వం చేపట్టిన కీలక కార్యక్రమాలనూ ఆయన ప్రధానంగా ప్రస్తావించారు.

సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు మాట్లాడుతూ... ఈ పోటీలకు ఎంపికైన యువతను అభినందించారు. ఈ కార్యక్రమంలో వారి భాగస్వామ్యమూ ఒక ముఖ్యమైన విజయమేనని అభివర్ణించారు. వారి ఉత్సాహాన్ని ప్రశంసిస్తూ... గత సంవత్సరం పోటీలో రూపొందించి, ప్రదర్శించిన అసాధారణ చిత్రాలను ఆయన గుర్తుచేసుకున్నారు. ఫైనల్‌లో ప్రదర్శనను "దాదాపు ఆస్కార్ లాంటిది"గా ఆయన అభివర్ణించారు. సీఎమ్‌వోటీ అరుదైన సహకారాన్ని పెంపొందిస్తుందన్నారు. ఎందరో కొత్తవారైన ప్రతిభావంతులు ఎంతో ఒత్తిడిలోనూ అద్భుతమైన కథలతో చిత్రాలను రూపొందించడం కోసం వస్తున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. "వీరిలో చాలా మంది దేశానికి భవిష్యత్ కథకులు... ప్రపంచ సాంస్కృతిక రాయబారులుగా మారతారు" అని చెబుతూ... ఇటీవల జాతీయ చలనచిత్ర అవార్డును గెలుచుకున్న సీఎమ్‌వోటీ పూర్వ విద్యార్థి ఉదాహరణను ఆయన ఉటంకించారు.

షార్ట్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు, సీఈవో కార్టర్ పిల్చర్ మాట్లాడుతూ... ఈ సంవత్సరం సీఎమ్‌వోటీని ఇప్పటి వరకు నిర్వహించిన అత్యంత ఉత్తేజకరమైన ఎడిషన్‌లలో ఒకటిగా అభివర్ణించారు. మరే ఇతర ప్రపంచ ఉత్సవంలోనూ కనిపించని గొప్ప వేదికను ఏర్పాటు చేసిన మంత్రిత్వ శాఖను ఆయన ప్రశంసించారు. "మునుపటి ఎడిషన్‌లలో పాల్గొన్న వారు ఇప్పటికే కేన్స్‌లో, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రధాన ఉత్సవాల్లో ప్రదర్శనలు ఇస్తున్నారు. ఆస్కార్ షార్ట్‌లిస్ట్‌లో కూడా చోటు సంపాదించారు" అని ఆయన అన్నారు. సంక్షిప్త రూపంలో కథ చెప్పడం ఇప్పుడు ప్రపంచ వినోదానికి కేంద్రంగా ఉందని పునరుద్ఘాటిస్తూ... నేర్చుకోవడానికి, సహకరించడానికి, సృజనాత్మక సరిహద్దులను అధిగమించడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సృష్టికర్తలను పిల్చర్ కోరారు.

సంయుక్త కార్యదర్శి (సినిమాలు) డాక్టర్ అజయ్ నాగభూషణ్, ఎన్ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ప్రకాష్ మగ్దూమ్‌లూ ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

'రేపటి సృజనాత్మక మేధస్సు' (క్రియేటివ్ మైండ్స్ ఆఫ్ టుమారో- సీఎంవోటీ) అనే కార్యక్రమం సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ... నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లు ప్రారంభించిన ఒక దార్శనిక కార్యక్రమం. భారతీయ చలన చిత్ర పరిశ్రమలోని వర్ధమాన ప్రతిభావంతులను కనుగొనడం, వారిని మరింత మెరుగుపరచడం, వెలుగులోకి తీసుకురావడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. ఇది కేవలం ప్రతిభకు సంబంధించిన కార్యక్రమం మాత్రమే కాదు... ఇది దేశ సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను మరింత ముందుకు నడిపించే భవిష్యత్ కథకుల ప్రతిభను ప్రపంచానికి చాటే చక్కటి వేదిక.

వర్ధమాన ప్రతిభావంతుల అభిరుచిని ప్రతి సంవత్సరం సీఎమ్‌వోటీ సినిమాటిక్ ప్రతిభగా మారుస్తోంది. దేశవ్యాప్తంగా ఉన్న వర్ధమాన చిత్రరూపకర్తలు ఆసియాలోని అత్యంత ప్రతిష్ఠాత్మక చలన చిత్రోత్సవాల్లో ఒకటైన ప్రపంచస్థాయి వేదికపై తమ నైపుణ్యాలను ప్రదర్శించడం కోసం ఒక అసాధారణ అవకాశాన్ని ఇది అందిస్తుంది.

భారత ప్రీమియర్ ఫిల్మ్ ఫెస్టివల్-ఐఎఫ్ఎఫ్ఐ సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమం నాలుగు ఎడిషన్లను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ ప్రతిష్ఠాత్మక ఐదో ఎడిషన్‌లో... సీఎమ్‌వోటీ ద్వారా మరోసారి మొత్తం 13 చలనచిత్ర కళల్లో 125 మంది యువత తమ ప్రతిభను ప్రదర్శిస్తారు.

1952లో ప్రారంభమైన భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం దక్షిణాసియాలోనే పురాతనమైన, అతిపెద్ద సినిమా వేడుకగా నిలుస్తుంది. నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్... భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ... గోవా రాష్ట్ర ప్రభుత్వం... గోవా ఎంటర్‌టైన్‌మెంట్ సొసైటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవం ప్రపంచ సినిమాకు ప్రధాన కేంద్రంగా ఎదిగింది. ఇక్కడ అలనాటి అపురూప చిత్రాలు, సాహసోపేతమైన ప్రయోగాత్మక చిత్రాలు, లెజెండరీ మాస్ట్రోలు, నిర్భయంగా రూపొందించిన తొలి సినిమాలు ఒకే చోట కలిసి ఈ వేడుకలకు హాజరైన ప్రేక్షకులను అలరిస్తాయి. అంతర్జాతీయ పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, మాస్టర్‌క్లాస్‌లు, ఘన నివాళులతో పాటు... ఆలోచనలు, ఒప్పందాలు, సహకారాలకు అపార అవకాశాలను అందించే శక్తిమంతమైన వేవ్స్ ఫిల్మ్ బజార్ వంటి కార్యక్రమాలు ఐఎఫ్ఎఫ్ఐని మరింత అద్భుత వేదికగా మారుస్తున్నాయి. నవంబర్ 20?28 వరకు అందమైన గోవా తీరప్రాంతంలో ప్రదర్శితమయ్యే 56వ ఎడిషన్.... ప్రపంచ వేదికపై భారత సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించే ఒక అద్భుతమైన వేడుకగా... భాషలు, శైలులు, ఆవిష్కరణలు, స్వరాల అద్భుత సంగమంగా నిలుస్తుంది.

# శ్రీహరికోటలోని ఇస్రోను సందర్శించిన మైగవ్ జాతీయ అంతరిక్ష దినోత్సవ క్విజ్ 2025 విజేతలు



న్యూఢిల్లీ, నవంబర్ 22: జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలతో మమేకవ్వాలనే ప్రధాన లక్ష్యంతో.. భారత ప్రభుత్వం ఆధ్వర్యంలోని పౌర అనుసంధాన వేదికైన మైగవ్.. అనేక కార్యక్రమాలను నిర్వహించింది. అంతరిక్ష రంగంలో భారత్ సాగిస్తున్న అద్భుతమైన ప్రయాణంపై అవగాహన పెంచడం, జ్ఞానాన్ని విస్తరించడమే లక్ష్యంగా సృజనాత్మక పోటీలు, సోషల్ మీడియాలో సమాచార ప్రచారాలు, న్యూస్‌లెటర్లు, బ్లాగులు, పాడ్‌క్యాస్టులు, వీడియోలతో సహా ప్రజల కోసం అనేక పోటీలను మైగవ్ రూపొందించింది.

వీటిలో 'జాతీయ అంతరిక్ష దినోత్సవం క్విజ్ 2025' ముఖ్యమైనది. భారత అంతరిక్ష కార్యక్రమంపై ప్రజల్లో ఆసక్తిని పెంపొందించడానికి, శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించడానికి, వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు దీన్ని రూపొందించారు. దేశవ్యాప్తంగా వేలాది మందిని ఈ కార్యక్రమం ఆకర్షించింది. అలాగే.. 100 మంది విజేతలకు 2025 నవంబర్ 11న సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం - శ్రీహరికోట రేంజ్ (ఎస్డీఎస్సీ షార్) వద్ద ఉన్న భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను సందర్శించే అవకాశాన్ని మైగవ్ అందించింది.

భారత్ చేపడుతున్న అంతర్జాతీయ స్థాయి పరిశోధన, ప్రయోగ కార్యకలాపాలకు సంబంధించి తెర వెనుక జరిగే సన్నద్ధతను అర్థం చేసుకొనే అవకాశం విజేతలకు ఈ పర్యటన అందించింది. భారత్ అంతరిక్ష ప్రయాణం, ప్రధాన విజయాలు, అత్యాధునిక సాంకేతికతల అభివృద్ధి అంశాలపై నిర్వహించిన చర్చల్లో సీనియర్ శాస్త్రవేత్తలు, అధికారులతో విజేతలు ముచ్చటించారు. ఈ నిర్దేశిత పర్యటనలో భాగంగా భారత వాహక నౌకలను అంతరిక్షంలోకి పంపించే మాస్టర్ కంట్రోల్ సెంటర్, లాంచ్ ప్యాడ్ 1,2లను సందర్శించే అవకాశం వారికి లభించింది. రాకెట్లను తయారీ, పరీక్ష, తరలింపు, ప్రయోగ మౌలిక వసతులను పరిశీలించారు. ఇది మిషన్ విజయవంతంగా పూర్తయ్యేలా చేసే కఠినమైన సన్నాహక ప్రయత్నాలకు సంబంధించి తెలుసుకొనే అరుదైన అవకాశాన్ని ఇచ్చింది.

దీనిని "జీవితంలో ఒక్కసారి మాత్రమే దక్కే అవకాశం"గా విజేతలు ఈ అనుభవాన్ని వర్ణిస్తూ.. ఇస్రో చేపడుతున్న ఆవిష్కరణలు, కచ్చితత్వం, దేశ పురోగతి పట్ల అంకితభావాన్ని ప్రశంసించారు. సైన్స్, ఇంజినీరింగ్, పరిశోధనారంగాల్లో తమ కెరీర్‌ను కొనసాగించాలనే సంకల్పాన్ని ఈ సందర్శన బలోపేతం చేసిందని దీనిలో పాల్గొన్న వారిలో చాలామంది తెలియజేశారు.

ఆవిష్కరణలు, అంతర్జాతీయ సహకారంలో ఇస్రో చేస్తున్న నిరంతర కృషి ప్రపంచ అంతరిక్ష రంగంలో భారత్‌ను అగ్రగామిగా తీర్చిదిద్దుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆదిత్య-ఎల్1, గగన్‌యాన్‌తో సహా త్వరలో చేపట్టబోయే గ్రహాంతర అన్వేషణతో అంతరిక్ష శాస్త్రం, సాంకేతికతల్లో కొత్త శిఖరాలను అధిరోహిస్తోంది.

శాస్త్రీయ విజ్ఞానాన్ని అందరికీ అందించడం, తర్వాతి తరం ఆవిష్కర్తలను, అన్వేషకులను ప్రోత్సహించాలనే ప్రభుత్వ నిబద్ధతను జాతీయ అంతరిక్ష దినోత్సవ క్విజ్ లాంటి కార్యక్రమాలు తెలియజేస్తాయి.

2023లో చంద్రయాన్-3పై నిర్వహించిన మహాక్విజ్‌తో మొదలుపెట్టి జాతీయ అంతరిక్ష దినోత్సవ క్విజ్ 2024, ఇప్పుడు 2025 సంచికతో జాతీయ స్థాయిలో అంతరిక్ష క్విజ్‌లను వరుసగా మూడో ఏడాది విజయవంతంగా మైగవ్ నిర్వహించడాన్ని ఈ పర్యటన సూచిస్తుంది. ప్రతి ఏడాది అత్యుత్తమ ప్రతిభావంతులు ఇస్రో క్యాంపస్‌లో చేపట్టే స్ఫూర్తిదాయకమైన వైజ్ఞానిక యాత్రతో ఈ కార్యక్రమం ముగుస్తుంది.

కొనసాగుతున్న ఈ ప్రయత్నాల ద్వారా భారత్ అంతరిక్ష విజయాలతో ప్రజలను మైగవ్ అనుసంధానిస్తుంది. అలాగే ప్రశ్నించే స్ఫూర్తిని, ఆవిష్కరణలను, జాతీయ గర్వాన్ని ప్రోత్సహిస్తుంది.

## పంచాయతీ ఎన్నికల కోసం సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేపట్టాలి

**-అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్**

**-ఎంపిడీవోలు లతో వీడియో కాన్ఫరెన్స్.**



సంగారెడ్డి నవంబరు 22(నేటి నిజం ప్రతినిది) పంచాయతీ ఎన్నికల కోసం అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ నుండి జిల్లాలోని ఎంపీడీవోలు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. స్టేజ్ వన్, స్టేజ్ టు రిటర్నింగ్ అధికారుల నియామకం శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలు, తిరిగి ఎన్నికల నిర్వహణ తర్వాత ఎన్నికల సామాగ్రి స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని అధికారుల ఆదేశించారు. అలాగే బీసీ రిజర్వేషన్ విషయంలో బీసీ డెడికేషన్ కమిషన్ నివేదికను అనుసరించి చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఓటరు జాబితాలో అభ్యంతరాలపై ఫిర్యాదులను స్వీకరించి, షెడ్యూల్ ప్రకారం తుది జాబితా ప్రకటించాలని పేర్కొన్నారు . ప్రశాంత వాతావరణంలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరిగేలా అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ డి పి ఓ సాయి బాబా , ఎంపీడీవోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు .

# 'ది బ్లూ ట్రైల్' తో ఉత్సాహభరితంగా ప్రారంభమైన 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం

న్యూఢిల్లీ, నవంబర్ 22: గోవా తీర ప్రాంతంలో ఈ రోజు అట్టహాసంగా మొదలైన 56వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా- ఐఎఫ్ఎఫ్ఐ) లో గాబ్రియేల్ మస్కారో రూపొందించిన డెస్టోపియన్ కథాచిత్రం 'ది బ్లూ ట్రైల్' (పోర్చుగీస్ భాషలో దీనిని 'ఓ ఆల్టిమో అజుల్' అని పిలుస్తారు)ను ప్రారంభ చిత్రంగా ప్రదర్శించారు. ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి విస్తృత ప్రశంసలు అందుకోవడంతో పాటు సంభ్రమాశ్చర్యాలను రేకెత్తించింది.

చిత్ర ప్రదర్శనకు ముందు జరిగిన ముఖాముఖీ కార్యక్రమంలో నటీనటులు మారియా అలెజాండ్రా రొహాస్, ఆర్టురో సలాజార్ ఆర్‌బీ, క్లారిస్సా పినెరో, రోసా మాలగ్వేటా, దర్శకుడు గాబ్రియెల్ మస్కారో తదితరులు వేదికను అలంకరించారు. సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి ఎల్. మురుగన్, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావ టంత్, సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు, ఐఎఫ్ఎఫ్ఐ ఫెస్టివల్ డైరెక్టర్ శేఖర్ కపూర్, ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ చిత్రం గురించి శేఖర్ కపూర్ మాట్లాడుతూ, "ఈ ప్రారంభ చిత్రాన్ని నేను బెర్లిన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో చూశాను. అక్కడ దీనికి సిల్వర్ బేర్ అవార్డు వచ్చింది, ఇది రెండవ అత్యుత్తమ పురస్కారం. ఇది చాలా కదిలించే చిత్రం. దీని గురించి మీతో మాట్లాడేందుకు నేను దర్శకుడికే అవకాశం ఇస్తాను" అన్నారు. దర్శకుడు గాబ్రియేల్ మస్కారో మాట్లాడుతూ, "ఒక వృద్ధ మహిళ గురించిన ఈ సినిమా మన జీవితానికి అర్థాన్ని వెతుక్కోవడంలో ఎప్పుడూ సమయం ఉంటుందనే సందేశాన్ని ఇస్తుంది" అని అన్నారు. ఐఎఫ్ఎఫ్ఐ భవిష్యత్ గురించి శేఖర్ కపూర్ మాట్లాడుతూ, "రెండు, మూడు సంవత్సరాలలో మన సందర్శకులు 100,000 మంది ఉంటారని నేను భావిస్తున్నాను. చాలా త్వరలోనే మనం కేన్స్ ఫెస్టివల్ స్థాయిని మించిపోతాం" అని విశ్వాసం వ్యక్తం చేశారు.

'ది బ్లూ ట్రైల్' ప్రీమియర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. జీవితంలోని సవాళ్లను హృదయాన్ని తాకేలా పరిచయం చేసిన తీరు, నిశ్శబ్ద ప్రతిఘటన, థెరిసా పాత్ర ధైర్యంగా ఆరంభించిన ప్రకాశవంతమైన స్వీయ అన్వేషణ ప్రయాణాన్ని ప్రేక్షకులు ప్రశంసించారు.

ఒక భయానకమైన డెస్టోపియన్ బ్రెజిల్ నేపథ్యాన్ని ఆధారంగా చేసుకుని రూపొందించిన 'ది బ్లూ ట్రైల్' చిత్రం, ఉత్సాహం చెదరని 77 ఏళ్ల వృద్ధురాలు థెరిసా కథను చెబుతుంది. విధి ప్రతికూలతను, తనను ఒక వృద్ధుల కాలనీకి పరిమితం చేయాలనే ప్రభుత్వ ఒత్తిడిని ఆమె ధైర్యంగా ఎదిరిస్తుంది. సొంత కలలు, ఆత్మ నిబ్బరంతో ఆమె అమెజాన్ నది ప్రాంతంలో ఒక సాహసోపేతమైన ప్రయాణాన్ని మొదలు పెడుతుంది. ఆకాశాన్ని తాకి జీవితంలో మొదటిసారిగా ఎగరాలనే ఆమె తహతహతో సాధారణ మార్గాల ప్రయాణానికి అనుమతి దొరకకపోవడంతో, పడవలో రహస్యంగా ప్రయాణిస్తుంది. ఈ ప్రయాణంలో ఆమెకు అనేక విభిన్నమైన పాత్రలు తారసపడతాయి. తన ధైర్యాన్ని పరీక్షించే సవాళ్లను ఎదుర్కొంటూ ఉత్కంఠ కలిగిస్తుంది. ప్రతి మలుపు, తడబాటు, క్షణకాల మాయతో థెరిసా ప్రయాణం వయస్సు పరంగా సమాజం నిర్దేశించిన సరిహద్దులకు చాలా దూరంగా, స్వేచ్ఛ, ధైర్యం, వ్యక్తిగత నిర్ణయాల ప్రకారం జీవించడంలోని అపార ఆనందానికి సాక్ష్యంగా మారుతుంది.

1952లో ప్రారంభమైన భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఇఫీ), దక్షిణ ఆసియాలోనే అత్యంత పురాతనమైన, అతిపెద్ద సినిమా ఉత్సవంగా పేరు గాంచింది. భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్డీసీ), గోవా రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన గోవా ఎంటర్‌టైన్‌మెంట్ సొసైటీ (ఈఎస్జీ) సంయుక్తంగా దీనిని నిర్వహిస్తున్నాయి. పునరుద్ధరించిన పాత సినీ కళాఖండాలు, ఆధునిక ప్రయోగ చిత్రాల ప్రదర్శనతో దిగ్గజ దర్శకులు, మొదటిసారి చిత్రాలు తీసిన కొత్త, సాహసోపేత దర్శకులు ఒకే వేదికను పంచుకునే ఈ ఉత్సవం అంతర్జాతీయ సినీశక్తి కేంద్రంగా ఎదిగింది.

అంతర్జాతీయ పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, మాస్టర్‌క్లాస్‌లు, నివాళులు ఆలోచనలు, ఒప్పందాలు, భాగస్వామ్యాలు, అత్యంత ఉత్సాహభరితమైన 'వేవ్స్ ఫిల్మ్ బజార్' వంటి వైవిధ్యభరిత అంశాల కలయిక ఇఫీని ప్రకాశవంతంగా మార్చాయి. నవంబర్ 20 నుంచి 28 వరకు గోవా సుందర తీరప్రాంత నేపథ్యంలో జరిగే 56వ ఎడిషన్, భాషలు, శైలులు, ఆవిష్కరణలు, స్వరాల అద్భుతమైన వైవిధ్యాన్ని హామీ ఇస్తోంది. ఇది ప్రపంచ వేదికపై భారతదేశ సృజనాత్మక ప్రతిభను సమగ్రంగా ప్రదర్శించే వేడుక.

# గోవాలో ప్రారంభోత్సవ వేడుకలతో మొదలైన వేవ్స్ ఫిల్మ్ బజార్

న్యూఢిల్లీ, నవంబర్ 22:దక్షిణాసియా ప్రపంచ చలనచిత్ర మార్కెట్ అయిన వేవ్స్ ఫిల్మ్ బజార్ గోవాలోని పంజిమ్‌లోని మారియట్ రిసార్ట్‌లో నేడు ప్రారంభమైంది. నేతలు, చిత్ర రూపకర్తలు, నిర్మాతలు, అంతర్జాతీయ ప్రతినిధులు హాజరైన ఈ కార్యక్రమం, స్ఫూర్తిదాయకంగా మొదలైంది. ప్రతిష్టాత్మకమైన భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవంతో పాటు ఏటా నిర్వహించే ఈ బజార్ 19వ సంచికను ఇప్పుడు 'వేవ్స్ ఫిల్మ్ బజార్'గా వ్యవహరిస్తున్నారు. సృజనాత్మక, ఆర్థిక భాగస్వామ్యాలను కోరుకునే దర్శకులు, నిర్మాతలు, సినిమా ప్రతినిధులు, ప్రోగ్రామర్లు, పంపిణీదారులకు ప్రపంచ సమావేశ కేంద్రంగా ఇది నిలుస్తుంది. ఈ కార్యక్రమం నవంబర్ 20 నుంచి 24 వరకు జరగనుంది.

ఈ సందర్భంగా సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు మాటాడుతూ.. వేవ్స్ ఫిల్మ్ బజార్‌ను ఇఫీ వేడుకలకు సహజమైన, సముచితమైన ప్రారంభంగా అభివర్ణించారు. ఇది "ప్రదర్శనలు, మాస్టర్ క్లాసులు, సాంకేతిక ప్రదర్శనల సంపూర్ణ వ్యవస్థగా" పేర్కొన్నారు. వేవ్స్ కొత్త గుర్తింపు "కళను వాణిజ్యంగా మార్చడం" అనే ప్రధానమంత్రి దార్శనికతకు అనుగుణంగా ఉందని తెలిపారు.

ప్రపంచంలో చిత్రరూపకర్తల కోసం ఏర్పాటు చేసిన మొదటి ఈ-మార్కెట్ వేదికగా 'వేవ్స్' ను ప్రస్తావిస్తూ.. "ఇది సృజనశీలురను, దేశాలను అనుసంధానిస్తూ.. భారత్‌ను ప్రపంచ సహకారానికి సమావేశ కేంద్రం గా మారుస్తుంది" అని ఆయన అభివర్ణించారు. ఇందులో ఎంపిక చేసిన వివిధ ప్రాజెక్టులు, నగదు గ్రాంట్లు, నిర్మాణాత్మక అభిప్రాయ సేకరణ ప్రక్రియలున్నాయని పేర్కొన్నారు. అలాగే దేశంలో తొలి కృత్రిమ మేధ చలనచిత్రోత్సవం, హ్యాకథాన్‌ను భావితరం సినిమా సాంకేతికతను అందిపుచ్చుకోడానికి ముఖ్య ప్రారంభంగా పేర్కొన్నారు.

గౌరవ అతిథిగా హాజరైన కొరి టయా రిపబ్లిక్ జాతీయ అసెంబ్లీ సభ్యురాలు శ్రీమతి జేవాన్ కిమ్ మాట్లాడుతూ, వేడుక ప్రారంభం నుంచీ నిర్వాహకుల కృషిని, నిబద్ధతను ప్రశంసించారు. భారత్, కొరియా మధ్య చురుకైన సహకారాన్ని ఆశిస్తున్నట్లు ఆమె తెలిపారు. 'వందే మాతరం' గీతాన్ని ఆమె చక్కగా ఆలపించి ప్రేక్షకుల నుంచి ప్రశంసలు , చప్పట్లు, అభివందనాలు అందుకున్నారు.

సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ ప్రసంగిస్తూ భారత్‌ను ప్రపంచ స్థాయి సినీ నిర్మాణ కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రధానమంత్రి దార్శనికత గురించి వివరించారు. ఈయన ఈ వేదికను "సృష్టికర్తలు, నిర్మాతల మధ్య వారధి"గా అభివర్ణించారు. యువతకు, కొత్త రచయితలకు శక్తినిచ్చే వేదికగా దీన్ని ప్రశంసించారు, ఈ సంవత్సరం బజార్‌లో 124 మంది కొత్త సృష్టికర్తలు పాల్గొనడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేయడంలో ఈ వేదిక కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

అదనపు కార్యదర్శి శ్రీ ప్రభాత్ ఈ కార్యక్రమంలో వందన సమర్పణ చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఐఎఫ్ఓఫ్ఐ ఫెస్టివల్ దర్శకుడు, ప్రముఖ చిత్ర దర్శకుడు శేఖర్ కపూర్, నటులు శ్రీ నందమూరి బాలకృష్ణ, శ్రీ అనుపమ్ ఖేర్; వేవ్స్ బజార్ సలహాదారు జెరోమ్ పైలార్డ్, ఆస్ట్రేలియా సినిమా దర్శకుడు డైరెక్టర్ గార్త్ డేవిస్, ఎన్ ఎఫ్ డీసీ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ప్రకాష్ మాగ్దం పాల్గొన్నారు. ఈ సంవత్సరం జరిగిన కార్యక్రమం సృజనాత్మకత, పరిశ్రమ నాయకత్వ గొప్ప సంగమాన్ని సూచిస్తుంది.

గతంలో ఫిల్మ్ బజార్ అని పిలిచే ఈ కార్యక్రమాన్ని 2007 లో నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎఫ్‌డీసీ) ప్రారంభించింది. అప్పటి నుంచి ఇది దక్షిణాసియాలో అత్యంత ప్రభావవంతమైన చిత్ర వేదికగా ఎదిగింది.

ఈ బజారులో స్క్రీన్ రచయితల ల్యాబ్, మార్కెట్ స్క్రీనింగ్‌లు, వ్యూయింగ్ రూమ్ లైబ్రరీ, కో-ప్రొడక్షన్ మార్కెట్ వంటి విభాగాల ద్వారా ఎంపిక చేసిన 300 కంటే ఎక్కువ చలనచిత్ర ప్రాజెక్ట్‌లను ప్రదర్శిస్తుంది. కో-ప్రొడక్షన్ మార్కెట్‌లో 22 ఫీచర్ సినిమాలు,5 డాక్యుమెంటరీలు ఉన్నాయి. అయితే వేవ్స్ ఫిల్మ్ బజార్ రికమెండ్స్ విభాగం బహుళ ఫార్మాట్‌లలో 22 ప్రత్యేక చిత్రాలను ప్రదర్శిస్తుంది. ఏడు కంటే ఎక్కువ దేశాల నుంచి ప్రతినిధి బృందాలు, పది కంటే ఎక్కువ భారతీయ రాష్ట్రాల నుంచి చలనచిత్ర ప్రోత్సాహక ప్రదర్శనలు వేదికను మరింత సమృద్ధిగా మారుస్తున్నాయి.

టెక్ పెవిలియన్‌లో అత్యాధునిక వీఎఫ్ఎక్స్, సీజీఐ, యానిమేషన్, డిజిటల్ ప్రొడక్షన్ సాధనాలను తెలుసుకోడానికి ప్రత్యేక స్థలం కేటాయించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది ఎల్‌టీఐమైండ్‌ట్రీ సహకారంతో సినిమా ఏఐ హ్యాకథాన్ ప్రారంభం కూడా జరగనుంది. ఇందులో కృత్రిమ మేధ ఆధారంగా కథ చెప్పడం, సర్టిఫికేషన్ ప్రక్రియలు, పైరసీ వ్యతిరేక ఆవిష్కరణలు వంటి రంగాల్లో ప్రయోగాలు చేసేందుకు సృజనకర్తలను ఆహ్వానిస్తుంది. ఇది సినీ రంగంలో సాంకేతికతను వినూత్నంగా ఉపయోగించడానికి ఒక ప్రత్యేక వేదికగా నిలుస్తోంది.

సృజనాత్మకత, సాంకేతికత, ప్రపంచ మార్పిడి సమ్మేళనంతో, వేవ్స్ ఫిల్మ్ బజార్ శక్తివంతమైన సహకారం, ఆవిష్కరణకు వేదికగా నిలుస్తోంది. సినిమా స్థాయి ఆలోచనలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలకు భారత్ ఒక చురుకైన కేంద్రంగా మారనుంది.

1952లో ఆవిర్భవించిన భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ) దక్షిణాసియాలోనే పురాతనమైన, అతిపెద్ద సినిమా వేడుకగా నిలుస్తోంది. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాకు చెందిన జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎన్ఎఫ్‌డీసీ).. గోవా రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ఎంటర్‌టైన్‌మెంట్ సొసైటీ (ఈఎస్‌జీ) సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవం.. పునర్నిర్మిత క్లాసిక్‌ల నుంచి సాహసోపేతమైన ప్రయోగాల వరకు, దిగ్గజ చిత్ర ప్రముఖుల నుంచి తొలి అడుగు వేస్తున్న కొత్త ప్రతిభావరుల వరకు అందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే ప్రపంచ స్థాయి సినీ వేదికగా ఎదిగింది. వైవిధ్యభరితమైన మేళవింపు, అంతర్జాతీయ పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, మాస్టర్‌క్లాస్‌లు, నివాళులు, ఆలోచనలు, ఒప్పందాలు, సహకారాలు రెక్కలు తొడిగిన ఉత్సాహవంతమైన ఫిల్మ్ బజార్ లతో ఐఎఫ్ఎఫ్ఐ మెరిసింది. గోవాలోని అందమైన తీరప్రాంతంలో నవంబర్ 20 నుంచి 28 తేదీ వరకు జరుగుతున్న 56వ సంచిక.. భాషలు, శైలులు, ఆవిష్కరణలు, స్వరాల అద్భుత సమూహారాన్ని ప్రదర్శిస్తూ, ప్రపంచ వేదికపై భారత సృజనాత్మక ప్రతిభకు అద్భుతమైన వేడుకగా నిలుస్తుంది.

# భారతదేశంలో స్వదేశీ వస్తువుల వినియోగం పెరగాలి

**-బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు**

హైదరాబాద్, నవంబరు22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );భారతదేశంలో స్వదేశీ వస్తువుల వినియోగం పెరగాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు సూచించారు. ప్రజల ఆలోచనా స్వదేశీ వస్తువులని వినియోగించేలా ఉండాలని కోరారు. భారతదేశం ఇతర దేశాల వస్తువుల మీద ఆధారపడకూడదని ఆత్మనిర్భర్ భారత్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. ఇవాళ( శుక్రవారం) హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆత్మనిర్భర్ భారత్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో రామచంద్రరావు, బీజేపీ నేతలు చంద్రశేఖర్ తివారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడారు. యాంటీ ఇండియా ఐడియాలజీ ఉన్నవారికి కాంగ్రెస్ నిన్న ఇందిరా గాంధీ అవార్డులు ఇవ్వడం దుర్మార్గమని మండిపడ్డారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా మనమందరం ముందుకెళ్లాలని సూచించారు. చైనా, అమెరికా తమ ఉత్పత్తులను పెంచి.. ప్రపంచ దేశాలను తమ గుప్పిట్లో పెట్టుకున్నాయని విమర్శించారు. గతంలో మాదిరిగా ఇప్పుడు ఎవరి మీద భారతదేశం ఆధారపడే పరిస్థితి లేదని తెలిపారు. ఆపరేషన్ సింధూర్ స్వదేశీ ఆయుధాలతో జరిగిందని.. అందుకే ఈ ఆపరేషన్ అంత సక్సెస్ అయ్యిందని రామచంద్రరావు పేర్కొన్నారు.

# "సర్పంచ్ ఎన్నికలు- బౌవిష్యత్ కార్యాచరణ పై" బీసీ జేఏసీ విస్తృత స్థాయి సమావేశం

**-బీసీలను నమ్మించి మోసం చేసిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చేలా జేఏసీ ఉద్యమం**



హైదరాబాద్ నవంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు - సర్పంచ్ ఎన్నికలు- బౌవిష్యత్ కార్యాచరణ పై" బీసీ జేఏసీ విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం కాచి గూడాలో బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశం లో బీసీ రిజర్వేషన్లపై రాజ్యాంగ సవరణ జరిగే వరకు ఉద్యమం తీవ్రతరం చేస్తాం బీసీలను నమ్మించి మోస గించిన కాంగ్రెస్ బీసీలకు వ్యతిరేకమైన పార్టీ బిజెపి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చేలా జేఏసీ ఉద్యమం ఈనెల 25న దిష్టిబొమ్మల దహనం, 30న బీసీల యుద్ధభేరి, 9న పార్లమెంటు ముట్టడించాలని నిర్ణయించారు. రాజ్యాంగ సవరణ ద్వారా మాత్రమే బీసీ రిజర్వేషన్లు సాధ్యపడుతుంది బీసీ రిజర్వేషన్ల పరిష్కారానికి మోడీ చొరవ తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది. గ్రామస్థాయి నుండి బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని సమావేశం నిర్ణయించింది.

# నేటి నుండి నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం లాంచీ జర్నీ ప్రారంభం

హైదరాబాద్ నవంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రకృతి ప్రేమికులకు, పర్యాటకులకు తెలంగాణ టూరిజం గుడ్ న్యూస్ చెప్పింది. నల్లమల అటవీ అందాల మధ్య కృష్ణా నదిలో ప్రయాణించాలనుకునే వారి కోసం నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం లాంచీ జర్నీనీ నేటి నుంచి పర్యాటక శాఖ మళ్లీ అందుబాలోకి తీసుకురానుంది. గతంలోనూ ఈ జర్నీ అందుబాటులోకి వచ్చినా కొన్ని కారణాల వల్ల దానిని వాయిదా వేశారు. మళ్లీ తిరిగి ఈ ప్రయాణం నేటి నుంచి అమల్లోకి రానుంది. అయితే, ఈ లాంచీ ప్రయాణం చేసే వారు ముందుగా నాగార్జున సాగర్ చేరుకోవాలి. అక్కడి నుంచి ఈ ప్రయాణం ప్రారంభమవుతుంది. పర్యాటకుల కోసం ప్రతి సంవత్సరం లాంచీ జర్నీ ఏర్పాటు చేస్తున్నామని పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రకటించింది. దట్టమైన నల్లమల అటవీ అందాలు, కృష్ణానది వరవళ్ల మధ్య నాగార్జునసాగర్ టు శ్రీశైలం వరకు సాగే లాంచీ ప్రయాణ పర్యాటకులకు ఎంతో ఉత్సాహాన్ని ఉల్లాసాన్ని ఇవ్వనుంది.

# పత్తి, సోయా కొనుగోళ్లు చేపట్టాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నా.. భారీగా ట్రాఫిక్ జామ్

ఆదిలాబాద్ నవంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఆదిలాబాద్ జిల్లాలోని పత్తి ,సోయాబిన్ కోనుగోళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వైఖరిని నిరసిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టా రు. హైదరాబాద్ -నాగపూర్ జాతీయ రహదారి 44 పై నిర్వహించిన ధర్నా కార్యక్రమా నికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు భారీగా తరలివ చ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా జాతీయ రహదారిపై బైఠాయించిన రైతు లు నిరసన తెలిపారు. పంటల కొనుగోలలో రెండు ప్రభుత్వాలు నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్త న్నాయని నాయకులకు తెలిపా రు. సీసీఐ తేమ శాతం పేరిట పత్తిని మద్దతు ధరతో కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు.రైతులకు మద్దతు ధర లభించకపోవడంతో మధ్య దళారులకు విక్రయించి పత్తి క్వింటాలుకు రూ.1500 చొప్పున నష్టపోతున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు ఏడు క్వింటా ళ్లు మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తుందని, మిగిలిన పత్తిని రైతులు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారని తెలిపారు. సోయాబీన్ కొనుగోలు సైతం ప లు నిబంధనలు అమలు చేస్తు న్నారని, వేలిముద్ర తప్ప ని సరి చేయడంతో రైతులు పంటను అమ్ముకునే పరిస్థితి లేదని వాపోయారు.

# పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మానవాళికి మనుగడ

**-తెలంగాణ అటవీ శాఖ ప్రధాన సంరక్షణ అధికారి డా. సి. సువర్ణ**




సిద్దిపేట నవంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సిద్దిపేట జిల్లా ములుగు మండలం కేంద్రంలోని అటవి కళాశాల మరియు పరిశోధన సంస్థ (ఎఫ్.సీ.ఆర్.ఐ)లో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, తెలంగాణ ఉన్నత విద్యా మండలి, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సౌజన్యంతో "పర్యావరణం మరియు వ్యర్థాల నిర్వహణ - సమస్యలు, ప్రభావాలు, సవాళ్లు మరియు అవకాశాలు" అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు ఘనంగా ప్రారంభమైంది. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల పరిశోధకులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పర్యావరణ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ సదస్సుకు కళాశాల డీన్ వి. కృష్ణ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా తెలంగాణ అటవీ శాఖ ప్రధాన సంరక్షణ అధికారి డా.సి.సువర్ణ, ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డా.డి.రాజిరెడ్డి, తెలంగాణ అటవీ సంరక్షణ అధికారి డా.ప్రియాంక వర్గీస్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డా.సి.సువర్ణ మాట్లాడుతూ "పట్టణీకరణ, నగరీకరణ వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతుంది, వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ఇలాగే కొనసాగితే భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది.పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మానవాళి మనుగడ, భవిష్యత్తు ఉంటుంది. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని" అన్నారు.ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డా.డి.రాజిరెడ్డి మాట్లాడుతూ "తెలంగాణ ప్రభుత్వం విజన్ డాక్యుమెంట్-2047 సిద్ధం చేస్తున్న తరుణంలో ఇలాంటి సదస్సు నిర్వహించడం పర్యావరణానికి గొప్ప మేలు చేస్తుంది. వ్యర్థాల నుండి సంపదను సృష్టించే పద్ధతులు కనిపెట్టి, కొత్త తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి పర్యావరణాన్ని కాపాడే బాధ్యత యువత, పరిశోధకులు, విద్యార్థులు తీసుకోవాలని" అన్నారు.తెలంగాణ అటవీ సంరక్షణ అధికారి డా.ప్రియాంక వర్గీస్ మాట్లాడుతూ "ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి, వ్యర్థాల నిర్వహణ మన స్వంత ఇంటి నుండే ప్రారంభం కావాలి. ప్రతి ఒక్కరూ రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్ అనే నినాదాన్ని పాటిస్తూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ తీసుకోవాలని" పిలుపునిచ్చారు.

# క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

**-ఎంపికైన విద్యార్థులను అభినందించిన హెచ్ఎం ఉపాధ్యాయులు**

**-రాష్ట్రస్థాయి క్రీడలకు కోహినూర్ (కే) విద్యార్థినీల ఎంపిక**




కొమురం భీం, నవంబర్ 22: రాష్ట్రస్థాయి క్రీడలకు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యు) మండలంలోని కోహినూర్ (కే) ఆశ్రమ పాఠశాల 13 మంది విద్యార్థునులు ఎంపిక అయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూసం నాందేవ్, క్రీడల పీఈటీ కనక వెంకటేశ్వరరావు తెలిపారు.

తమ పాఠశాల విద్యార్థునులు జోనల్ లెవెల్ గిరిజన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి క్రీడలకు కోహినూర్ (కె) పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూసం నాందేవ్ తెలిపారు. కబడ్డీ సీనియర్ విభాగంలో కె. మంజుల (9వ తరగతి), వాలీబాల్ జూనియర్ విభాగంలో పి. పుల్లవంతి, కె. లక్ష్మి (8వ తరగతి), ఖోఖో సీనియర్ విభాగంలో ఎం. గౌరు (9వ తరగతి), క్యారం జూనియర్ విభాగంలో జి. లావణ్య, ఎస్. శిరీష (8వ తరగతి), చెస్ జూనియర్ విభాగంలో ఎం. లావణ్య (7వ తరగతి), అథ్లెటిక్స్ సీనియర్ విభాగంలో జి. రమేశ్వర్ (9వ తరగతి), జూనియర్ విభాగంలో హెచ్‌కే. గౌరు, ఎస్. శ్రీమలరాణి (6వ తరగతి), హైజంప్ సీనియర్ విభాగంలో హెచ్‌కే. దుర్గాదేవి (9వ తరగతి) రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని 13 మంది విద్యార్థినిలు రాష్ట్ర స్థాయిలో పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకి గర్వకారణమని వారు పేర్కొన్నారు.

ఎంపికైన విద్యార్థునులను జైనూర్ ఏటిడిఓ శ్రీనివాస్, ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అభినందించి మెమెంటోలు అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల పిఈటీ కనక వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు లక్ష్మణ్ రావు, పూల్ సింగ్, మాధవి, లక్ష్మి, భాగ్యలక్ష్మి, అరుణ, అరవింద్,శశికళ,దన్లాల్,పారుబాయి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బీజేపీ నేత రెడ్డబోయిన గోపి జన్మదిన వేడుకలు




రాజన్న సిరిసిల్ల, నవంబర్ 22:(నేటినిజం ప్రతినిధి): బిజెపి అధ్యక్షులు రెడ్డబోయిన గోపి 55వ జన్మదినం వేడుకలను శనివారం వేములవాడ పట్టణ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోడె మొక్కలు చెల్లించి, గుడి వద్ద యాచకులు, పెద్లకు పండ్లు పంపిణీ చేశారు. సిరిసిల్ల పార్టీ కార్యాలయంలో రెడ్డ బోయిన గోపీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు రావల్లి శ్రీధర్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపికి రాజన్న, భీమన్న ఆశీస్సులతో మరిన్ని ఉన్నత పదవులు చేకూరాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్, కట్కం శ్రీనివాస్ మెరుగు లక్ష్మణ్, జవాజి శేఖర్, బచ్చు వంశీ కృష్ణ, గుంటి కనకయ్య, రేగుల శ్రీకాంత్, వాస మల్లేశం యాదవ్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పేరిట ప్రజలను భయాందోళన గురిచేస్తే సహించేదిలేదు

**-బీఆర్ఎస్ నేత చెల్మెడ లక్ష్మీనరసింహారావు**

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 22:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందని వేములవాడ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిని ఎవరు అడ్డుకోవడం లేదని, అభివృద్ధిని స్వాగతిస్తున్నప్పటికీ ప్రభుత్వ పనితీరుపైనే ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు.రాజన్న ఆలయంలో చేస్తు న్న అభివృద్ధి ఇప్పటికీ రహస్య ంగా ఉంచడమే కాకుం డా కనీ సం స్థానిక పట్టణ వాసు లకు కూడా వెల్లడించకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నిం చారు. ఎప్పటిలోగా పూర్తి చేస్తామని చెప్పకుండానే రాజన్న ఆలయాన్ని మూసివేశారని, దీం తో ఇప్పటికే వేలాది కుటుం బాలు రోడ్డున పడ్డాయన్నారు. వ్యాపారం నడుస్తుందో నడవ దో తెలియని పరిస్థితులు నెలకొ న్నాయని అన్నారు. అనేక చిరువ్యాపారులు భయాందోళన మధ్య బ్రతుకుతున్నారని,అభివృద్ధి జరిగితే వ్యాపారం వృద్ధి చెందు తుంది అన్న ఆశ కూడా లేకుం డా ఉందన్నారు. ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పనితీరు, అభి వృద్ధి పేరుతో ఎవరిపై విరుచు కుపడతారని, నిత్యం భయా ందోళన మధ్య రాజన్న ఆలయ పరిసరాల్లో ఉన్న కుటుంబాలు బిక్కుబిక్కుమంటున్నాయన్నారు. ప్రధాన రహదారిని విస్తరిస్తా మని గొప్పలు చెప్పి, చివరికి వారికి కనీస పరిహార విషయం లోనూ న్యాయం చేయకుండానే బలవంతంగా కూల్చివేశార న్నా రు. కన్న తల్లికి అన్న పెట్టనోడు పిన తల్లికి బంగారు గాజులు చేయి ంచిన ట్టు, ఇచ్చిన పరిహా రం మీద కోర్టుకు వెళ్ళమని మా త్రం ఉచిత సలహా ఇచ్చారన్నారు. ఇప్పుడు మళ్లీ పాత ఆంధ్ర బ్యాంక్ రహదారిని ఆలయ విస్తరణ కోసం ఆక్రమిస్తున్నారని, ఈ దక్షిణ ప్రధాన రహదారిలో ఉన్న ఇండ్లు, దుకాణాల యజమానులు ఇప్పటికే గుండె పట్టుకొని కాలం వెళ్లదీస్తున్నారన్నారు. పరిహారం నిర్ణయించకుండా, ఎక్కడి దాకా తీసుకుంటారు నోటీసులు ఇవ్వకుండా, ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదని నిలదీశారు.

# మహిళ అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట

ఆదిలాబాద్, నవంబర్ 22:కాంగ్రెస్ ప్రభుత్వం , సీఎం రేవంత్ రెడ్డి అన్నిరంగాల్లో మహిళలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నారని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. శనివారం తెలంగాణ ప్రగతి ఇందిర మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా చిట్యాల మున్సిపాలిటీ పరిధిలో అధికారులు ఏర్పాటు చేసిన చీరల పంపిణీకి ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరై మహిళలకు చీరలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి మహిళలను అన్ని రంగాల్లో సొంతంగా ఆదాయం సంపాదించడం కోసం కుటుంబాన్ని పోషించడం కోసం అనేక పథకాలు చేపట్టారని పేర్కొన్నారు. స్కూల్ యూనిఫాం, రూ.28 కోట్ల వడ్డీలేని రుణాలు, బ్యాంక్ లింకేజీ కార్యక్రమంలో 600 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఉచిత బస్సు కోసం రూ.8వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారన్నారు. ఈ పథకాన్ని చాలా మంది మహిళలు ఉపయోగించుకుంటున్నారన్నారు. రేషన్ సన్నబియ్యం పంపిణీకోసం 12వేల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత మహిళలకు ఇష్టమైన రంగులతో చీరలను మన రాష్ట్రంలోని సిరిసిల్ల, కరీంనగర్ లో తయారు చేసిన చీరలను పంపిణీ చేస్తుందన్నారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చేసిన సేవలు గుర్తి చేసుకుంటూ వారి పేరు మీదుగా ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ అని నామకరణం చేశామన్నారు. అంతకుముందు మండలానికి సంబంధించిన సీఎంఆర్ఎఫ్ 27 చెక్కులు కళ్యాణ లక్ష్మి షాద్ ముబారక్ 40 చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు.

# కామారెడ్డిలో ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

## -ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్చార్జి మంత్రి సీతక్క



కామారెడ్డి, నవంబర్ 22: కామారెడ్డి జిల్లా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ముగింపు సమావేశానికి కామారెడ్డి నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరయ్యారు

ఈ సందర్భంగా యువకులు గ్రంథాలయాలను వినియోగించుకొని పోటీ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. యువకులు పట్టుదలతో చదవాలన్నారు. కామారెడ్డి గ్రంథాలయంలో గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి గ్రంథాలయ సౌకర్యాలను ఎన్నో కల్పించారన్నారు దాతల సహకారం ఎంతో ఉందన్నారు.

ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ గ్రంథాలయంలో చదువుకునే విద్యార్థులకు ఎన్నో సౌకర్యాలను కల్పించడంలో నేను ముందున్నాను అని అన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం ఎన్నో ఉద్యోగాలను కల్పించనున్నదని యువకులు పోటీ పరీక్షలకు సిద్ధంగా ఉండాలన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షట్కర్ మాట్లాడుతూ గ్రంథాలయ సేవలను అందరూ ఉపయోగించుకోవాలని సమస్య లను పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ యువకులను ఉద్దేశించి మాట్లాడారు కామారెడ్డి గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాల్లో అనేక పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులోకి తెచ్చామని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని పుస్తకాలను అందజేయగలమని యువకులు వీటిని వినియోగించుకోవాలని అన్నారు.

విద్యార్థులకు యువకులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు.

# నూతన ఎస్పీగా శ్రీ నితికా పంత్

ఆసిఫాబాద్, నవంబర్ 22: కోమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా నూతన ఎస్పీ శ్రీ నితికా పంత్ శనివారం రోజునజిల్లా పోలీస్ కార్యాలయంలో ముందుగా పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, అనంతరం ఎస్పీగా బాధ్యత లు స్వీకరించారు. ఈ సందర్భం గా ఎస్పీ గారికి జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలుకుతూ పుష్పగుచ్చాలు అందజేశారు.గతంలో సంగారెడ్డి ఏఎస్పీ గా, మేడ్చల్ డి.సి.పి గా, హైదరాబాద్ టాస్క్ ఫోర్స్ డీసీపీగా, ఆదిలాబాద్ బెటాలియన్ కమాం డెంట్గా విధులు నిర్వహించిన శ్రీ నితికా పంత్ ప్రస్తుతం కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు.జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ పూర్తిగా కట్టుబడి ఉందని ఎస్పీ పేర్కొన్నారు.సామాన్య ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి, వారి సమస్యలను చట్టపరంగా పరిష్కరించడం పోలీసుల ప్రధాన లక్ష్యమన్నారు.

# 'చెల్మెడ' సహకారంతో విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ..



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 22:(నేటినిజం ప్రతినిధి): బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేపట్టిన గిఫ్ట్ ఏ స్మైల్ ను వేములవాడ నియోజకవర్గ బీఆరెస్ ఇంఛార్జి చెల్మెడ లక్ష్మీనరసింహరావు ఆచరణలో పెట్టారు. ఈ సందర్భంగా వేములవాడ నియోజవర్గంలోని వేములవాడ పట్టణంతో పాటు బీసీ ఎస్సీ బాలుర, బాలికల వసతి సంక్షేమ గృహాలకు, కోనరావుపేట మండలంలోని ధర్మారంలో గల బాలుర వసతి సంక్షేమ గృహానికి, చందుర్తి మండల కేంద్రంలో గల బాలుర వసతి సంక్షేమగృహానికి, రుద్రంగి బాలుర మండల కేంద్రంలో గల వసతి సంక్షే గృహానికి దాదాపు 400 పైగా దుప్పట్లను చెలిమెడ సహకారంతో విద్యార్థులకు విద్యార్థి విభాగం నాయకులతో కలిసి, మండల అధ్యక్షులు నాయకులు దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంపై విద్యార్థులు స్పందించి మాట్లాడుతూ చలికాలం మాకు దుప్పట్లు చాలా సౌకర్యంగా ఉంటాయని ఆనందం వ్యక్తం చేశారు. మాకు సహాయం చేసిన చెల్మెడకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, మారం కుమార్, జోగిని శంకర్, గోలి మహేష్, నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, కొండ కనకయ్య, వాసాల శ్రీనివాస్, నీరటి మల్లేశం, పోతూ అనిల్ కుమార్, మంత సందీప్, సాయి గౌడ్, దిలీప్, చందుర్తి, రుద్రంగి, కొనరావుపేట మండల అధ్యక్షులు వేకల ఎల్లయ్య, తిరుపతి, మల్యాల దేవయ్య, రుద్రంగి మాజీ ఎంపీపీ గంగం స్వరూప మహేష్, సెస్ డైరెక్టర్ గంగారం, గ్రామ శాఖ అధ్యక్షులు కమలాకర్ మండలాల ముఖ్య నాయకులు, తదితరులు ఉన్నారు.




# పోలీసుల ఆరోగ్యం అత్యంత ముఖ్యం-జిల్లా ఎస్పీ మహేష్ బి గితే

### - ఉచిత కంటి వైద్య శిబిరం

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 22:(నేటినిజం ప్రతినిధి): శాంతి భద్రతల పరిరక్షణకై నిరంతరం శ్రమించే పోలీసులు తమ వ్యక్తిగత ఆరోగ్యంతో



పాటు తమ కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల శ్రద్ద చూపాలని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. శనివారం రోజున జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులకు,సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు శరత్ మాక్సీ విజన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని జిల్లాయ ఎస్పీ ప్రారంభించి సిబ్బందితో పాటు వైద్య పరీక్షలు చేపించుకున్నారు .అనంతరం ఎస్పీ మాట్లాడుతూప్రజలకు నిరంతరం సేవలందించే పోలీసుల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, పోలీసులు ఆరోగ్యంగా వున్నప్పుడే సమాజానికి మెరుగైన సేవలు అందించ గలరని, ఆరోగ్య పరిరక్షణ కోసం పోలీసులు ఆరోగ్య పరీక్షలకై సమయాన్ని కేటాయించాలన్నా రు.విధి నిర్వహణకై అంకితమైన పోలీసులతో పాటు వారి కుటుంబ సభ్యుల సంక్షేమన్ని దృష్టిలో ఉంచుకొని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఈ శిబిరాలను పోలీసులుఉ వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ శిబిరంలో నేత్ర వైద్యుల బృందం పాల్గొని కంటి ఆరోగ్య పరిశీలన,దృష్టి సమస్యల నిర్ధారణ,అవసరమైన మందులు,సూచనలు అందించారు. రోజువారీ ఒత్తిడి,ఫీల్డ్ పనులు,రాత్రి పూట డ్యూటీ కారణంగా కంటి సమస్యలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇలాంటి శిబిరాలు పోలీస్ సిబ్బందికి ఎంతో ఉపయుక్తమని, వైద్యులు పేర్కొన్నారు.ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసిన శరత్ మ్యాక్సీ విజన్ యాజమాన్యంతో పాటు ఇందులో పాల్గొన్న వైద్య నిపుణులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సిఐలు మొగిలి, శ్రీనివాస్, రవి, నాగేశ్వరరావు, మధుకర్, ఆర్ఐలు మధుకర్, రమేష్,యాదగిరి, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఆర్ఆర్ఎస్ అభియాన్ ప్రారంభం..



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 22:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో శనివారం ఆర్ఆర్ఎస్ అభియాన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా వేములవాడ పట్టణంలోని మార్కండేయ కాలనీలో ఉన్న అంబా భవాని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీలో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి ఆర్ఎస్ఎస్ జన జాగరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సహా కార్యవగ్ కోపల్ల రాజన్న, కోనం పుల్ల రెడ్డి, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com